RNI No: APTEL -2023/89112 www.andhrapragathi.com

ప్రతి అక్షరం ప్రజాహితం

నేటి ఆంధ్రప్రగతి

తెలుగు దినపత్రిక

సంపుటి - 02 సంచిక -129 పేజీలు - 08 వెల - 04/- ఆదివారం 23 ఫిబ్రవరి 2025

## ఉత్తరాంధ్ర టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో రఘువర్మకు మద్దతు ప్రకటించిన జనసేన

**పాకాలపాటి రఘువర్మకు**

**మద్దతివ్వాలని పవన్ కల్యాణ్ నిర్ణయం**

**ఒకే మాట మీద నిలవాలని పార్టీ శ్రేణులకు సూచన**



2లో

# 24 నుంచి అసెంబ్లీ

## మరో రెండ్రోజుల్లో ఏపీ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు

**జగన్ హాజరయ్యే అవకాశం!**

**జగన్ వైసీపీ ఎమ్మెల్యేల సభ్యత్వం రద్దయ్యే ప్రమాదం**

**అసెంబ్లీకి ఒకరోజు వచ్చి వెళ్లిపోయే ఆలోచనలో జగన్, ఇతర వైసీపీ ఎమ్మెల్యేలు**

అమరావతి, ఆంధ్ర ప్రగతి ఫిబ్రవరి 22: ఏపీ అసెంబ్లీ సమావేశాలు ఫిబ్రవరి 24 నుంచి జరగనున్నాయి. ఈ సమావేశాల్లోనే బడ్జెట్ ప్రవేశపెట్టనున్నారు. అసెంబ్లీ సమావేశాల తొలి రోజున రాష్ట్ర గవర్నర్ ఉభయసభలనుద్దేశించి ప్రసంగించనున్నారు. మిగతాది 2లో...






## ఇద్దరు ఐపీఎస్ అధికారులను రిలీవ్ చేసిన తెలంగాణ

**అంజనీ కుమార్, అభిలాష బిస్తను రిలీవ్ చేసిన తెలంగాణ**


**జీవో జారీ చేసిన ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి**

**కరీంనగర్ పోలీస్ కమిషనర్ రిలీవ్‌పై ఈసీకి ప్రభుత్వం లేఖ**

2లో

## మిర్చి రైతుల సమస్యలపై బాబుఫోకస్

**రైతు సంఘం నేతలతో చంద్రబాబు చర్చ**



అమరావతి, ఆంధ్ర ప్రగతి ఫిబ్రవరి 22: మిర్చి రైతుల సమస్యలపై ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు స్పెషల్ ఫోకస్ పెట్టారు. చంద్రబాబుతో రైతు సంఘం నేత మన్నవ సుబ్బారావు శనివారం ఏపీ సచివాలయంలో సమావేశం అయ్యారు. ఈ సమావేశంలో పలు కీలక అంశాలపై చర్చించారు. ఈ సమావేశంలో చర్చించిన అంశాలను మీడియాకు మన్నవ సుబ్బారావు వెల్లడించారు. రైతు సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని రైతు సంఘం నేత మన్నవ సుబ్బారావు తెలిపారు.

.మిగతాది 2లో...

## వచ్చే నెల నుంచి కొత్త రేషన్ కార్డులు



**: మంత్రి నాదెండ్ల మనోహర్**

**నెల్లూరు జిల్లాలో మంత్రి నాదెండ్ల పర్యటన**

**సంగంలో రైసుమిల్లు, స్టాక్‌పాయింట్‌ను తనిఖీ చేసిన మంత్రి**

**క్యూఆర్ కోడ్ తో కూడిన రేషన్ కార్డులు ఇస్తామని వెల్లడి**

2లో




## గ్రూప్-2 పరీక్ష వాయిదావేయలేం..

**ప్రభుత్వ లేఖకు బదులిచ్చిన ఏపీపీఎస్సీ**

**ఏపీలో గ్రూప్-2 మెయిన్స్ వాయిదా వేయాలంటున్న అభ్యర్థులు**

**ఏపీపీఎస్సీకి లేఖ రాసిన రాష్ట్ర ప్రభుత్వం**

**పరీక్ష యథాతథంగా నిర్వహిస్తున్నామన్న ఏపీపీఎస్సీ**




2లో

## అమరావతి నిర్మాణ పనులకు ముమూర్తం ఖరారు

**మార్చి 15నుంచి ప్రారంభం అవుతాయని వెల్లడి**

**30వేల మంది కార్మికులతో శరవేగంగా నిర్మాణ పనులు**

అమరావతి, ఆంధ్ర ప్రగతి ఫిబ్రవరి 22: రాజధాని అమరావతి పనుల ప్రారంభానికి ప్రభుత్వం ముహూర్తం నిర్ణయించింది. ఎప్పుడెప్పుడు ప్రారంభమవుతాయా అని ఎదురుచూస్తున్న వేళ కీలక సమాచారం వచ్చేసింది. మార్చి 15 నుంచి రాజధాని పనులు ప్రారంభంకానున్నట్లు వెల్లడించింది.

.మిగతాది 2లో...



## చెత్త పన్నుకు ముగింపు

**చెత్త పన్ను విధించిన గత వైసీపీ ప్రభుత్వం**

**గత డిసెంబర్ 31న చెత్త పన్నును రద్దు చేసిన కూటమి ప్రభుత్వం**

**తాజాగా మున్సిపల్ చట్ట సవరణ తర్వాత గెజిట్ జారీ చేసిన ప్రభుత్వం**




అమరావతి, ఆంధ్ర ప్రగతి ఫిబ్రవరి 22: వైసీపీ ప్రభుత్వ హయాంలో విధించిన చెత్త పన్నును ఏపీ ప్రభుత్వం రద్దు చేసిన సంగతి తెలిసిందే. గత ఏడాది డిసెంబర్ 31 నుంచి చెత్త పన్నును రద్దు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. తాజాగా మున్సిపల్ చట్ట సవరణ తర్వాత గెజిట్ విడుదల చేసింది. ఏపీలో ఇకపై చెత్త పన్ను ఉండదు. వైసీపీ ప్రభుత్వం చెత్త పన్నును విధించినప్పటి నుంచి అప్పుడు విపక్షంలో ఉన్న నేతలు విమర్శలు గుప్పిస్తూనే వచ్చారు. ఎన్నికల ప్రచారంలో సైతం ఈ అంశాన్ని అస్త్రంగా వాడుకున్నారు. తాము అధికారంలోకి వస్తే చెత్త పన్ను రద్దు చేస్తామని కూటమి నేతలు ప్రకటించారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీల్లో భాగంగా కూటమి ప్రభుత్వం చెత్త పన్నును రద్దు చేసింది.

# కుప్పకూలిన టన్నెల్



## ఎస్ఎల్బిసిలో ప్రమాదం

- సొరంగం పైకప్పు కూలి చిక్కుపడిన 8మంది
- టన్నెల్ బోరింగ్ సమయంలో 9మీటర్ల మేర కూలిన పైకప్పు
- ప్రమాదానికిసీపేజ్ వాటరే కారణం
- సురక్షితంగా బయటపడిన 42మంది కార్మికులు
- వీరంతా యుపి, జమ్మూకశ్మీర్కు చెందిన వారు
- సొరంగం లోపల 14కి.మీ దూరంలో దుర్ఘటన
- క్లిష్టంగా మారిన సహాయకచర్యలు
- ఎన్ఐఆర్ఎఫ్ బృందాలతో రెస్క్యూ ఆపరేషన్

2లో



### టన్నెల్ ప్రమాద ఘటనపై ప్రధాని ఆరా

**సిఎం రేవంత్ రెడ్డికి ఫోన్ చేసి తెలుసుకున్న మోడీ**

ఎస్ఎల్‌బీసీ టన్నెల్ ప్రమాద ఘటనపై ప్రధాని మోడీ ఆరా తీశారు. ఈ మేరకు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఫోన్ చేశారు. ఘటనకు సంబంధించి పూర్తి వివరాలను రేవంత్‌రెడ్డి.. ప్రధానికి వివరించారు.



ప్రతి అక్షరం ప్రజాహితం
ఆంధ్రప్రగతి
తెలుగు దినపత్రిక



# గ్రూప్-2 పరీక్ష వాయిదావేయలేం..

అమరావతి, ఆంధ్ర ప్రగతి ఫిబ్రవరి 22:
రాష్ట్రంలో రేపు (ఫిబ్రవరి 23) జరగాల్సిన గ్రూప్-2 మెయిన్స్ పరీక్షను అభ్యర్థుల ఆందోళలను దృష్టిలో ఉంచుకుని వాయిదా వేయాలని ఏపీ ప్రభుత్వం రాసిన లేఖకు ఏపీపీఎస్సీ బదులిచ్చింది. రేపటి పరీక్షను వాయిదా వేయలేమని స్పష్టం చేసింది. రాష్ట్రంలో ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున, గ్రాడ్యుయేట్లకు ప్రయోజనం కల్పించే నిర్ణయాలు తీసుకోలేమని ఏపీపీఎస్సీ స్పష్టం చేసింది. అందుకే రేపు జరగాల్సిన పరీక్షను షెడ్యూల్ ప్రకారమే యథాతథంగా నిర్వహిస్తున్నట్టు తెలిపింది. 2023లో గ్రూప్-2 పరీక్షల కోసం విడుదల చేసిన నోటిఫికేషన్ ప్రకారం... రోస్టర్ పాయింట్ల విధానంలో తప్పులున్నాయని, వాటిని సరిదిద్దాకే గ్రూప్-2 మెయిన్స్ పరీక్ష నిర్వహించాలని గత కొన్ని రోజులుగా అభ్యర్థులు ఆందోళనలు చేపడుతున్నారు.
గ్రూప్-2 అభ్యర్థుల ఆందోళనలను పరిగణనలోకి తీసుకుని మెయిన్స్ పరీక్షను వాయిదా వేయాలని తాజాగా రాష్ట్ర ప్రభుత్వం ఏపీపీఎస్సీకి లేఖ రాసింది. అయితే, ఈ దశలో పరీక్షను వాయిదా వేయలేమని ఏపీపీఎస్సీ ప్రత్యుత్తరం ఇచ్చింది.

## ఉత్తరాంధ్ర టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో రఘువర్మకు మద్దతు ప్రకటించిన జనసేన

అమరావతి, ఆంధ్ర ప్రగతి ఫిబ్రవరి 22:
శ్రీకాకుళం-విజయనగరం-విశాఖ జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేస్తున్న పాకాలపాటి రఘువర్మకు మద్దతు ఇస్తున్నట్టు జనసేన పార్టీ హైకమాండ్ నేడు ప్రకటించింది. ఈ మేరకు పార్టీ అధ్యక్షుడు పవన్ కల్యాణ్ నిర్ణయం తీసుకున్నట్టు వెల్లడించింది. తూర్పు గోదావరి-పశ్చిమ గోదావరి... ఉమ్మడి కృష్ణా-గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి అభ్యర్థుల విజయం కోసం ఏ విధంగా జనసేన అండగా నిలుస్తుందో... ఉత్తరాంధ్ర టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికల్లోనూ ఒకే మాట మీద నిలవాలని పవన్ పార్టీ శ్రేణులకు సూచించారు. ఇవాళ జనసేన రాజకీయ వ్యవహారాల చైర్మన్, మంత్రి నాదెండ్ల మనోహర్ నేడు ఉత్తరాంధ్ర జిల్లాలకు చెందిన జనసేన ఎమ్మెల్యేలు, పార్టీ నేతలతో టెలీకాన్ఫరెన్స్ ద్వారా సమావేశమయ్యారు. సార్వత్రిక ఎన్నికల్లో ప్రదర్శించిన స్ఫూర్తినే ఎమ్మెల్సీ ఎన్నికల్లోనూ కనబర్చాలని నాదెండ్ల పిలుపునిచ్చారు. ఏపీలో రెండు గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ స్థానాలకు, ఒక ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానానికి ఎన్నికలకు ఇటీవలే నోటిఫికేషన్ విడుదల చేశారు. ఫిబ్రవరి 27న పోలింగ్ జరగనుండగా, మార్చి 3న ఓట్ల లెక్కింపు చేపట్టనున్నారు.

## 24 నుంచి అసెంబ్లీ

**(మొదటి పేజి తరువాయి)**బీఏసీ సమావేశం అనంతరం, ఈసారి అసెంబ్లీ సమావేశాలు ఎన్ని రోజులు జరుగుతాయన్న అంశంపై స్పష్టత రానుంది. కాగా, ఈసారి వైసీపీ అధినేత జగన్ తో పాటు, ఆ పార్టీకి చెందిన ఇతర ఎమ్మెల్యేలు కూడా అసెంబ్లీకి హాజరవుతారని తెలుస్తోంది. ఎందుకంటే... వరుసగా 60 పనిదినాల పాటు అసెంబ్లీకి హాజరుకాకపోతే, సదరు ఎమ్మెల్యేపై అనర్హత వేటు పడుతుందని ఇటీవలే ఏపీ అసెంబ్లీ స్పీకర్ అయ్యన్నపాత్రుడు, డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు ఓ ప్రెస్ మీట్ లో చెప్పారు. ఆ లెక్కన జగన్ కు అనర్హత ముప్పు పొంచి ఉందని సూచనప్రాయంగా వెల్లడించారు. ఈ నేపథ్యంలో, శాసనసభ సభ్యత్వాలు రద్దయ్యే ప్రమాదం ఉండడంతో... జగన్ సహా వైసీపీ ఎమ్మెల్యేలు ఒక రోజు అసెంబ్లీ సమావేశాలకు హాజరై వెళ్లిపోవాలనే ఆలోచనలో ఉన్నట్టు తెలుస్తోంది.

## ఇద్దరు ఐపీఎస్ అధికారులను రిలీవ్ చేసిన తెలంగాణ

అమరావతి, ఆంధ్ర ప్రగతి ఫిబ్రవరి 22:
ఐపీఎస్ అధికారులు అంజనీ కుమార్, అభిలాష బిస్త్‌ను తెలంగాణ ప్రభుత్వం రిలీవ్ చేసింది. ఆంధ్రప్రదేశ్‌లో బాధ్యతలు చేపట్టేందుకు వీలుగా వారిని వెంటనే రిలీవ్ చేస్తున్నట్లు తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి జీవోలో పేర్కొన్నారు. అలాగే, కరీంనగర్ పోలీస్ కమిషనర్ అభిషేక్ మహంతి రిలీవ్‌పై ఎన్నికల కమిషన్‌కు ప్రభుత్వం లేఖ రాసింది.
కరీంనగర్‌లో ఈ నెల 27న ఎమ్మెల్సీ ఎన్నికలు జరగనున్నందున అభిషేక్ మహంతి విషయంలో నిర్ణయం తీసుకోవాలని కోరుతూ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారికి లేఖ రాశారు.
అంజనీ కుమార్, అభిలాష బిస్త్, అభిషేక్ మహంతి ఆంధ్రప్రదేశ్‌కు వెళ్లాలని కేంద్ర హోంశాఖ శుక్రవారం నాడు ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్ర విభజన అనంతరం డీవోపీటీ రెండు తెలుగు రాష్ట్రాలకు అఖిల భారత సర్వీసు అధికారులను కేటాయించింది. దీనిపై కొందరు అధికారులు క్యాట్‌ను ఆశ్రయించారు. తర్వాత డీవోపీటీ హైకోర్టులో పిటిషన్ వేసింది. తదనంతర పరిణామాల నేపథ్యంలో ముగ్గురు ఐపీఎస్‌లను ఏపీలో రిపోర్ట్ చేయాలని హోంశాఖ ఆదేశించింది.

## మిర్చి రైతుల సమస్యలపై బాబు ఫోకస్



**(మొదటి పేజి తరువాయి)**
సీఎం చంద్రబాబు రైతులకు సంబంధించి కొన్ని సూచనలు చేశారని అన్నారు. ఎకరాకు రూ.3 లక్షలు అవుతుందంటే సీఎం ఆశ్చర్యం వ్యక్తం చేశారని తెలిపారు. మిర్చి పంటలకు టెక్నాలజీ. వాడమని సీఎం చంద్రబాబు చెప్పారని అన్నారు. ఎలక్ట్రానిక్ కాటా ఉపయోగించమని సీఎం చెప్పారని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం నుంచి కొంత ఆర్థిక సహాయం అందుతుందని సీఎం చంద్రబాబు చెప్పారని అన్నారు. కేంద్ర. రాష్ట్ర ప్రభుత్వాలు రైతులను ఆదుకుంటాయని సీఎం చంద్రబాబు చెప్పారని అన్నారు. జగన్ వచ్చినపుడు నిజమైన రైతులు ఆందోళన చేయలేదని చెప్పారు. కిరాయి మూకలు వచ్చి ఆందోళన చేశారని మన్నవ సుబ్బారావు పేర్కొన్నారు. అంతకుముందు మిర్చి రైతులు, యార్డు ట్రేడర్లతో సీఎం చంద్రబాబు సమావేశం నిర్వహించారు. మిర్చి రైతుల సమస్యలు, ప్రస్తుత మిర్చి ధరలపై ప్రధానంగా చర్చించారు. ఈ సమావేశానికి వ్యవసాయ శాఖ, సహచర మార్కెంటింగ్ శాఖ, పశుసంవర్ధక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి గురుతు రాజశేఖర్, వ్యవసాయశాఖ డైరెక్టర్ ఢిల్లీ రావు, వ్యవసాయ మార్కెటింగ్ డైరెక్టర్ విజయ సునీత, వ్యవసాయశాఖకు సంబంధించి అధికారులు, ట్రేడర్లు సమావేశానికి హాజరయ్యారు. ముఖ్యంగా మిర్చి ధర గత కొంతకాలంగా తగ్గుతూ వస్తోంది. ముఖ్యమంత్రి చంద్రబాబు ఢిల్లీ వెళ్లి కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రితో భేటీ అయి రాష్ట్రంలో మిర్చి రైతుల సమస్యలపై వివరించడం, దానిపై కేంద్రం వెంటనే స్పందించి రాష్ట్రంలో చిల్లి ధర పరిస్థితిపై స్పందించి.. కేంద్రం నుంచి సహాయం అందిస్తామని చెప్పడంతో ఈరోజు గుంటూరు మిర్చి యార్డు ట్రేడర్లు, మిర్చి కొనుగోలు చేసే వర్తకులతో సీఎం కీలక సమావేశం నిర్వహించారు.

# అమరావతి నిర్మాణ పనులకు ముహూర్తం ఖరారు

**(మొదటి పేజీ తరువాయి)**
ఏప్రిల్ మొదటి వారం నుంచి అమరావతిలో 30 వేల మంది కార్మికులు పనులు చేస్తారని అధికారులు చెబుతున్నారు. ఎన్నికల కమిషన్ ఆదేశాలతో టెండర్లు ఖరారు ఆలస్యం అయ్యింది. టెండర్లు పిలుచుకోవచ్చు కానీ ఖరారు చేయవద్దని ఈసీ స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. ఇప్పటి వరకు దాదాపు 62 పనులకు సీఆర్డీఏ, ఏడీసీ టెండర్లను పిలిచింది. సుమారు 40 వేల కోట్ల విలువైన పనులకు టెండర్ల పక్రియ కొనసాగుతోంది. మరో 11 పనులకు త్వరలో టెండర్లు పిలువనున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రాజధాని అమరావతి నిర్మాణాన్ని ప్రాధాన్య ప్రాజెక్టు తీసుకుంది. అందులో భాగంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రి నారాయణ స్వయంగా అమరావతి ప్రాంతాల్లో పర్యటించి అక్కడ నిలిచిపోయిన పనులను పరిశీలించారు. తరువాత చెన్నై ఐఐటీ, హైదరాబాద్ ఐఐటీలకు చెందిన నిపుణుల బృందం అమరావతి ప్రాంతాన్ని సందర్శించారు. అమరావతిలో సెక్రటేరియెట్, అసెంబ్లీ వంటి ఐకానిక్ భవనాల పటిష్టతపై పూర్తిస్థాయిలో అధ్యయనం చేశారు. ఇక్కడ నిర్మాణాలకు ఎలాంటి ఢోకా లేదంటూ ఐఐటీ బృందం నివేదిక ఇచ్చింది. లాగే ఎమ్మెల్యే, ఎమ్మెల్సీల క్వార్టర్స్, ఐఏఎస్, ఐపీఎస్ భవనాలు పటిష్టంగా ఉన్నాయని రిపోర్ట్ ఇచ్చారు. దాదాపు 40 వేల కోట్లకు సంబంధించి 62 పనులపై మార్చి 15 నుంచే శ్రీకారం చుట్టనున్నారు. మిగిలిన 11 పనులకు త్వరలో టెడర్లను పూర్తి చేసి రెండున్నరేళ్లలో అమరావతి పనులను పూర్తి చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. అలాగే అమరావతిలో పేరుకుపోయిన జంగిల్ క్లియరెన్స్‌ను పూర్తిస్థాయిలో తొలగించేశారు. దీంతో నిర్మాణాలకు ఎలాంటి ఆటంకం లేకుండా శరవేగంగా పనులు ముందుకు సాగుతాయనే అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతోంది.

# వచ్చే నెల నుంచి కొత్త రేషన్ కార్డులు

అమరావతి, ఆంధ్ర ప్రగతి ఫిబ్రవరి 22:
రాష్ట్రవ్యాప్తంగా వచ్చే నెల నుంచి కొత్త రేషన్ కార్డులు మంజూరు చేసేందుకు చర్యలు చేపట్టామని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ వెల్లడించారు. ఈ రేషన్ కార్డులు ఆధునిక టెక్నాలజీతో క్యూ ఆర్ కోడ్ లను కలిగి ఉంటాయని తెలిపారు. మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డితో కలిసి మంత్రి నాదెండ్ల మనోహర్ ఇవాళ పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సంగం సమీపంలోని రైసుమిల్లును, జెండాదిబ్బ వద్దనున్న బహుళ ప్రయోజన సౌకర్య గోదాము (స్టాక్ పాయింట్)ను మంత్రి తనిఖీ చేశారు. రైసుమిల్లును తనిఖీ చేసి ధాన్యం సేకరణకు సంబంధించిన పలు విషయాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం జెండా దిబ్బ వద్ద స్టాక్ పాయింట్‌ను తనిఖీ చేసి స్టాకు వివరాలు, సరఫరా మొదలైన వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు.



ఈ సందర్భంగా మంత్రి నాదెండ్ల మనోహర్ మహిళలనుద్దేశించి మాట్లాడారు. ఇది మహిళా పక్షపాత ప్రభుత్వమన్నారు. మహిళలందరూ కూడా ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల్లో భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు.
వచ్చే నెల నుంచి కొత్త రేషన్ కార్డులను అందిస్తామని చెప్పారు. రేషన్ కార్డుల్లో మార్పులు, చేర్పులకు అవకాశం కల్పిస్తామన్నారు. అన్ని గ్రామ, వార్డు సచివాలయాల ద్వారా ఈ ప్రక్రియ మొదలుపెట్టనున్నట్లు చెప్పారు. ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన దీపం-2 పథకం హామీని సీఎం చంద్రబాబు నెరవేర్చారని, ఇందులో భాగంగా ఈ జిల్లాలో 4 లక్షల మందికి ఉచిత గ్యాస్ సిలిండర్లు పంపిణీ చేసినట్లు చెప్పారు.
రాష్ట్రంలో 93.42 లక్షల మందికి గ్యాస్ కనెక్షన్లు ఇచ్చామని, ఈ ఏడాది 1.50 కోట్ల గ్యాస్ కనెక్షన్లు ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నట్లు చెప్పారు. ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల సమాచారం మహిళలందరూ తెలుసుకోవాలని, భాగస్వామ్యం కావాలని సూచించారు. మే నెల నుంచి అన్ని సంక్షేమ హాస్టళ్లు, పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకం కోసం మంచి సన్నబియ్యాన్ని పంపిణీ చేస్తామని చెప్పారు.

# ప్రధాని మోదీ 2వ ముఖ్య కార్యదర్శిగా ఆర్బీఐ మాజీ గవర్నర్ శక్తికాంత దాస్ నియామకం

న్యూఢిల్లీ, ఆంధ్ర ప్రగతి ఫిబ్రవరి 22:
రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మాజీ గవర్నర్ శక్తికాంత దాస్ ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ప్రిన్సిపల్ సెక్రటరీ-2గా నియమితులయ్యారు. ఆయన నియామకాన్ని అపాయింట్‌మెంట్స్ కమిటీ ఆఫ్ క్యాబినెట్ ఆమోదించింది. శక్తికాంత దాస్ భాధ్యతలు చేపట్టినప్పటి నుంచి ఆయన నియమాకం అమల్లోకి వస్తుంది. ప్రధానమంత్రి టర్మ్ వరకు కానీ తదుపరి ఉత్తర్వులు వెలువడేంత వరకూ ఆయన ఈ పదవిలో కొనసాగుతారని ప్రభుత్వ ప్రకటన పేర్కొంది. పీకే మిశ్రా 2019 సెప్టెబర్ 11 నుంచి ప్రధానమంత్రికి పర్సనల్ సెక్రటరీగా ఉన్నారు. ఆరేళ్ల పాటు ఆర్బీఐ గవర్నర్‌గా పనిచేసిన శక్తికాంత దాస్



గత ఏడాది డిసెంబర్‌లో పదవీ విరమణ చేశారు. దీంతో ఆర్బీఐ 26వ గవర్నర్‌గా సంజయ్ మల్హోత్రా బాధ్యతలు స్వీకరించారు. 67 ఏళ్ల శక్తికాంత దాస్ 2018లో ఊర్జిత్ పటేల్ అకస్మాత్తుగా రాజీనామా చేయడంలో ఆర్బీఐ గవర్నర్ గవర్నర్ బాధ్యతలు చేపట్టారు. 1980 తమిళనాడు ఐఏఎస్ బ్యాచ్‌కు చెందిన దాస్ ఢిల్లీలోని సెయిట్ స్టీఫెన్ కాలేజీలో మాస్టర్ డిగ్రీ చేశారు. బర్మింగ్‌హామ్ యూనివర్శిటీలో పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్‌లో పోస్ట్ గ్రాడ్యుయేషన్ చేశారు. 2016 నవంబర్‌లో పెద్దనోట్లను రద్దు చేసినప్పుడు ఆర్థిక వ్యవహారాల కార్యదర్శిగా శక్తికాంతదాస్ ఉన్నారు. 2017 జూలై 1 నుంచి పలు ప్రత్యక్ష పన్నులు జీఎస్టీలో విలీనం చేయడంలో ఆయన కీలకంగా వ్యవహరించారు. 2021లో ఆర్బీఐ గవర్నర్‌గా ఆయన పదవికాలం ముగియాల్సి ఉండగా మరో మూడేళ్లు పదవీకాలాన్ని పొడిగించారు.

# కుప్పకూలిన టన్నెల్

ఆంధ్ర ప్రగతి ఫిబ్రవరి 22:
ఎస్ఎల్‌బీసీ టన్నెల్‌లో రెస్క్యూ ఆపరేషన్ ఇంకా ప్రారంభం కాలేదు. టన్నెల్ ప్రమాదంపై ప్రభుత్వం ఎప్పటికప్పుడు సమీక్ష జరుపుతోంది. ఈ ప్రమాదంలో ఎనిమిది మంది టన్నెల్‌లోనే చిక్కుకుపోయినట్లు అధికారులు గుర్తించారు. దీంతో పదమూడు గంటలుగా వారు టన్నెల్‌లోనే ఉండిపోయారు. ప్రమాద ప్రాంతంలో నీరు, బురద, మట్టి ఉన్నట్లు గుర్తించారు.ప్రమాదం జరిగిన ప్రాంతానికి మూడు ఎన్డీఆర్ఎఫ్ బృందాలు వచ్చాయి. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఫోన్ చేసి వివరాలు అడిగి తెలుసుకున్నారు.
ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ ప్రమాదంపై సమీక్ష నిర్వహించారు. మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, సాగునీటి పారుదల సలహాదారు ఆదిత్యనాథ్ దాస్, ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్ రెడ్డి ఈ సమీక్షలో పాల్గొన్నారు. ప్రస్తుత పరిస్థితిపై వారు సమీక్షించారు. సహాయక చర్యలను వేగవంతం చేయాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. ఎస్ఎల్బీసీ టన్నెల్ ప్రమాదంపై మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పందించారు. ప్రమాద ఘటన సమాచారం అందుకున్న వెంటనే ఆయన హెలికాప్టర్ లో టన్నెల్ వద్దకు చేరుకున్నారు. సహాయక చర్యలను స్వయంగా పర్యవేక్షిస్తున్నారు. ఈ సందర్భంగా టన్నెల్ కూలిపోయిన ప్రదేశంలో ఆయన మీడియాతో మాట్లాడారు. ఉదయం 8 గంటలకు కార్మికులు సొరంగం లోపలికి వెళ్లారని, ఉదయం 8.30 గంటలకు బోరింగ్ మెషీన్ ను ఆన్ చేశారని ఉత్తమ్ కుమార్ రెడ్డి వెల్లడించారు. 20 మీటర్లు డ్రిల్లింగ్ చేయగానే టన్నెల్ లోకి నీళ్లు లీక్ అయ్యాయని వివరించారు. టన్నెల్ లో ఒకవైపు నుంచి నీరు లీక్ కావడంతో మట్టి కుంగిపోయిందని తెలిపారు.
బోరింగ్ మెషీన్ ఆపరేటర్ ప్రమాదాన్ని ముందే పసిగట్టాడని, దాంతో బోరింగ్ మెషీన్ వెనకున్న 42 మంది కార్మికులను బయటికి పంపించివేశారని మంత్రి



ఉత్తమ్ కుమార్ రెడ్డి వెల్లడించారు. బోరింగ్ మెషీన్ కు ముందున్న 8 మంది బయటికి రాలేక టన్నెల్ లోపల చిక్కుకున్నారని తెలిపారు. వారిలో ఇద్దరు విదేశీ ఇంజినీర్లు, ఇద్దరు మెషీన్ ఆపరేటర్లు, నలుగురు కార్మికులు ఉన్నారని పేర్కొన్నారు. విదేశీ ఇంజినీర్లు మినహా మిగిలిన వారు యూపీ, ఝార?ండ్ కు చెందిన వారు అని వివరించారు. సొరంగంలో చిక్కుకున్న 8 మందిని ప్రాణాలతో కాపాడేందుకు సర్వశక్తులా కృషి చేస్తున్నామని అన్నారు. 14 కిలోమీటర్ల లోపల ఉన్నందున సహాయ చర్యలు క్లిష్టంగా మారాయని తెలిపారు. ఇలాంటి ఆపరేషన్స్ లో నిపుణలైన ఎన్డీఆర్ఎఫ్ సిబ్బందిని తీసుకువస్తామని ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు.ప్రమాద ఘటనపై కేంద్రమంత్రి కిషన్ రెడ్డి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ప్రమాదానికి సంబంధించిన వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఎస్-ఎల్‌బీసీ టన్నెల్ లోపల చిక్కుకున్న కార్మికులను సురక్షితంగా బయటకు తీసుకురావాలన్నారు. గాయపడిన వారికి మెరుగైన చికిత్స అందించాలని స్పష్టం చేశారు.ఎస్ఎల్‌బీసీ టన్నెల్ ప్రమాదానికి పూర్తి బాధ్యత రేవంత్ రెడ్డిదేనని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. సుంకిశాల ఘటన మరువక ముందే మరో దుర్ఘటన జరగడం ప్రభుత్వ వైఫల్యమే అన్నారు. టన్నెల్‌లో చిక్కుకున్న వారి కోసం సహాయక చర్యలు చేపట్టాలని ఆయన అన్నారు. ఎస్ఎల్‌బీసీ టన్నెల్‌పై పారదర్శకంగా విచారణ జరిపించాలని అన్నారు.

## టన్నెల్ ప్రమాద ఘటనపై ప్రధాని ఆరా

వెస్ఎల్‌బీసీ టన్నెల్ ప్రమాద ఘటనపై ప్రధాని మోదీ ఆరా తీశారు. ఈ మేరకు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఫోన్ చేశారు. ఘటనకు సంబంధించి పూర్తి వివరాలను రేవంత్‌రెడ్డి.. ప్రధానికి వివరించారు. సొరంగంలో ఎనిమిది మంది చిక్కుకున్నారని, వారిని కాపాడేందుకు సహాయక చర్యలు చేపట్టినట్టు తెలిపారు. మంత్రులు ఉత్తమ్ కుమార్‌రెడ్డి, జూపల్లి కృష్ణారావు సహాయక చర్యలను పర్యవేక్షిస్తున్నారని వెల్లడించారు. ఘటనా స్థలికి ఎన్డీఆర్ఎఫ్ బృందాలను పంపిస్తున్నట్టు ప్రధాని మోదీ.. సీఎంకు చెప్పారు. పూర్తి స్థాయిలో సహకరిస్తామని హామీ ఇచ్చారు. ఇప్పటికే 3 ఎన్డీఆర్ఎఫ్ బృందాలు టన్నెల్ వద్దకు చేరుకున్నాయి. విజయవాడ నుంచి రెండు, హైదరాబాద్ నుంచి ఒక బృందం ఘటనా స్థలికి చేరుకున్నాయి. సింగరేణి నిపుణుల బృందం కూడా అక్కడికి వెళ్లనుంది. నాగర్‌కర్నూల్ కలెక్టర్, ఎస్పీ ఘటనా స్థలిలోనే ఉండి సహాయక చర్యలను పర్యవేక్షిస్తున్నారు. నాగర్‌కర్నూల్ జిల్లాలోని దోమలపెంట సమీపంలో ఎస్ఎల్‌బీసీ టన్నెల్ వద్ద శనివారం ఉదయం ప్రమాదం చోటుచేసుకుంది. ఎడమవైపు సొరంగం 14వ కిలోమీటర్ వద్ద మూడు మీటర్ల మేర పైకప్పు పడిపోయింది. ప్రాజెక్టును త్వరగా పూర్తి చేయాలనే లక్ష్యంతో ఇటీవల ప్రభుత్వం పనులను తిరిగి ప్రారంభించింది. ఇందులో భాగంగా నాలుగు రోజుల క్రితం పనులు ప్రారంభమయ్యాయి. ఈ ఉదయం మొదటి షిప్ట్‌లో సుమారు 50 మంది కార్మికులు సొరంగంలోకి వెళ్లారు. ఉదయం 8.30 గంటల సమయంలో కార్మికులు పని చేస్తుండగా.. అకస్మాతుగా పైకప్పు కూలింది. దీంతో కార్మికులు భయాందోళనకు గురయ్యారు. వారిలో 42 మంది బయటకి రాగా.. 8 మంది కార్మికులు లోపల చిక్కుకున్నారు.

ప్రతి అక్షరం ప్రజాహితం
ఆంధ్రప్రగతి
తెలుగు దినపత్రిక
ఆదివారం 23 ఫిబ్రవరి 2025

# పటిష్టమైన విదేశాంగ విధానం ముఖ్యం.

న్యూఢిల్లీ,, ఆంధ్ర ప్రగతి ఫిబ్రవరి 22:
స్వాతంత్ర్యానంతరం మనం ఎన్నో ఒడిదుడుకులు ఎదుర్కొన్నాం. ఇటీవల మళ్లీ అలాంటి కుయుక్తులు సాగుతున్నాయి. తాజాగా అమెరికా అధ్యక్షుడు ట్రంప్ చేసిన వ్యాఖ్యలు ఆందోళన కలిగిస్తున్నాయి. మనదేశఅంతర్గత వ్యవహారాల్లో బైడెన్ ప్రభుత్వం జోక్యం చేసుకున్నట్లు వెల్లడయ్యింది. అదికూడా ఎన్నికల వ్యవహారంలో తలదూర్చి నిధులు కేటాయించినట్లుగా తెలుస్తోంది. ఇక్కడ ఓ విషయం గమనిస్తే..కాంగ్రెస్ నేత రాహుల్ గతంలో అమెరికాలో పర్యటించారు. ఆయన అక్కడే ఉండి మనదేశ అంతర్గత వ్యవహారాలపై అనేకం మాట్లాడారు. ఆ తరవాతే ఆదానీ గ్రూపుపై హిండెన్‌బర్గ్ నివేదిక వచ్చింది. ఇప్పుడు ట్రంప్ మరో బాంబు పేల్చారు. ఈ రెంటికీ ఏమైనా సంబంధం ఉందా అన్న అనుమానాలు కలుగుతున్నాయి. వీటిని జాగ్రత్తగా గమనిస్తే అనుమానాలు ఉన్నట్లు రాజకీయ నిపుణులు కూడా భావిస్తున్నారు. అయితే అంతర్గ వ్యవహారాల్లో దూరి దేశాన్ని అస్థిరపరచాలన్న చీప్ ట్రిక్స్ ఆడారా అన్నది ముమ్ముందు తేలనుంది. భారత్, అమెరికాలు ప్రపంచంలో రెండు అతి పెద్ద ప్రజాస్వామిక దేశాలు మాత్రమే కాదు, అగ్రగామి ఆర్థిక వ్యవస్థలు కూడా. ఆర్థిక సత్తాలో ప్రథమ స్థానంలో ఉన్న అమెరికా, ఐదవ స్థానంలో ఉన్న భారత్ మధ్య సన్నిహిత సంబంధాలు ఏర్పడడం ప్రపంచానికీ అత్యంత ప్రయోజనకరంగా మారనుంది. అతిపెద్ద మార్కెట్‌గా ఉన్న భారత్‌ను అమెరికా వదులుకోవడానికి సిద్దంగా లేదు. అలాగే అనేకమంది మన మేధావులు ఇప్పుడు అమెరికన్ ఐటిని శాసిస్తున్నారు. గతంలో మోదీ పర్యటనతో భారతీయ అమెరికన్లలో ఒక రకమైన ఆత్మ స్థైర్యం, బలం ఏర్పడిందనడంలో సందేహం లేదు.

అమెరికా జనాభాలో ఒక శాతంగా ఉన్న భారత అమెరికన్లు ఇరు దేశాల మధ్య సంబంధాలు మరింత బలోపేతం కావాలని కోరుకుంటున్నారు. ఈ క్రమంలో కొందరు అస్థిరపరచే చర్యలు చేస్తున్నట్లుగా తెలుస్తోంది. ఇలాటి వారిపై కఠినంగా ఉండాల్సిందే. నిజానికి మనం ఏ దేశంలోనూ వేలుపెట్టే అవకాశం తెచ్చుకోం. ఇతరులు జోలికి వస్తే ఊరుకోం. ఏ దేశానికైనా పటిష్టమైన విదేశాంగ విధానం ఉండాలి. ప్రపంచ దేశాల్లో ఇదే ముఖ్యం. ఇతర దేశాలు కష్టసమయాల్లో ఉంటే ఆదుకోవాలి. అన్నార్తులను ఆదుకునే ప్రయత్నం చేయాలి. ఇరుగుపొరుగుతో ఇచ్చిపుచ్చుకునే ధోరణి ముందునుంచీ మనం పాటిస్తున్నాం. దేశ సార్వభౌమత్వాన్ని కాపాడుకుంటూనే..సర్వస్వతంత్రంగా మనగలగేలా మన గత పాలకులు, ప్రస్తుత పాలకులు వ్యవహరిస్తున్నారు. గతంలో పాక్ మంత్రులు పలువురు ఇలాగే ప్రేలారు. తల్లిపాలు తాగి రొమ్ముగుద్దే రకంలో పాక్ ముందుంటుంది. ఇప్పుడు బంగ్లా తోడయ్యింది. బిబిసి కూడా అడపాదడపా తన కుట్రలను వెల్లడిస్తోంది. మొన్నటికి మొన్న మాజీ చీఫ్ జస్టిస్ డివై చంద్రచూడ్ ఇంటర్వ్యూలో కూడా బిబిసి అడిగిన ప్రశ్నలు దాని కుత్సిత స్వభావాన్ని బయటపెట్టాయి. ఆదానీ విషయంలో కూడా అమెరికా హిండెన్‌బర్గ్ చేసిన ఆరోపణలను గర్హించాల్సిందే. దేశంలో మనం నిలదీయాల్సిన సమస్యల్లో విదేశీయులను తలదూర్చేలా చేయడం వల్ల అంతర్జాతీయంగా మనపరువును మనమే పోగొట్టుకున్న వారం అవుతాం. నిజానికిమోదీ హయాంలో ప్రపంచ దేశాల్లో భారత్‌కు లభించినంత గుర్తింపు మరే ప్రధానమంత్రి హయాంలో లభించలేదన్న విషయం ఎవరైనా



గుర్తించాల్సిందే. కరోనా సమయంలో అనేక పేద దేశాలకు ఉచితంగా వ్యాక్సిన సరఫరా చేసి వారికి అండగా నిలిచారు. అలాగే టర్కీ, సిరియా భూకంప బాధితులకు
అండగా నిలిచిన మన బృందాలు సహాయక చర్యల్లో పాల్గొన్నాయి. గత పదేళ్లలో మోదీ ప్రపంచంలోని దాదాపు అన్ని దేశాలలోనూ పర్యటించి భారత్‌కు అంతర్జాతీయంగా అనితరసాధ్యమైన గుర్తింపు తీసుకుని వచ్చారు. ఏదేశమేగినా మోడీ గురంచి చర్చించుకునేలా చేశారు. విదేశాగ విధానంలో మోడీ కొత్త ఒరవడిని
సృష్టించారు. అగ్రరాజ్యాలైన అమెరికా, రష్యాలతోపాటు చైనాతో కూడా సత్సంబధాలు నెలకొల్పడంలో మోడీ విజయం సాధించారు. చిన్నచిన దేశాలకు ఆపన్నహస్తం అందించడం ద్వారా భారత్ వారికి అండగా నిలుస్తుందన్న భరోసా ఇచ్చారు. భారతదేశంలో విచ్ఛిన్నకర శక్తులను ఏరివేయడం, కశ్మీర్‌లో పాక్ ఉగ్రవాదానికి కళ్లెం వేయడం వెనుక ప్రపంచ దేశాల అండదండలున్నాయని,మోదీ వివిధ దేశాధినేతలతో ఏర్పర్చుకున్న సత్సంబంధాల వల్లే ఇవాళ మనకు అంతర్జాతీయ మద్దతు లభిస్తున్నదని విదేశీ వ్యవహారా లను పరిశీలించే వారెవరికైనా అర్థమవుతుంది. పాక్‌ను ఉగ్రవాద దేశంగా ప్రకటించడం, ఇస్లామిక్ దేశాలు కూడా ఆ దేశానికి మద్దతు నీయకపోవడం, అంతర్జాతీయంగా పాకిస్థాన్ ఏకాకి కావడం మొదలైన పరిణా మాలు భారత్‌కు అంతర్జాతీయంగా ఉన్న పట్టును సూచిస్తున్నాయి. ముఖ్యంగా అమెరికా అండదండలు బలంగా లభించాయని స్పష్టమవుతోంది. ప్రపంచంలో మోడీ సమర్థ నేతగా ఎదగడం వల్లనే అనేక దేశాలు ఇప్పుడు భారత్‌వైపు చూస్తున్నాయి. ఈ రకమైన మద్దతు ద్వారా మనదేశ ప్రతిభ విస్తరించడమే గాకుండా ప్రపంచంలో మనకు పెద్దన్న పాత్రను కట్టబెడుతున్నాయి. ప్రధానంగా ఇస్లామిక్ టెర్రరిజంపై పోరాడుతున్న దేశంగా భారత్‌తో కలసి అనేక దేశాలు ముందుకు వస్తున్నాయి. అందులో అమెరికా కూడా ఉంది. అందుకే అమెరికాలో మోదీ పర్యటించినప్పుడల్లా ప్రపంచం ఆసక్తిగా చూస్తోంది. ఇరు దేశాల్లో గతంలో ఎన్నడూ లేనంత చెలిమి నెలకొంది. ముఖ్యంగా మోదీ ప్రధానమంత్రి అయిన తర్వాత భారత్ – అమెరికాల మధ్య సాన్నిహిత్యం మరింత పెరిగింది. భారత్, అమెరికా ప్రభుత్వాధినేతల మధ్య ఎన్నడూ లేని రీతిలో దృఢంగా వున్నాయి.ఉగ్రవాదం,ఆర్థిక అసమానతలు, రక్షణ సహకారం,ఇంటెలిజెన్స్ సమాచార పంపిణీ, పర్యావరణం, సైబర్ నేరాలు, ఇంధన భద్రత, కమ్యూనికేషన్ విప్లవం, వర్తక సంబంధాలు, పెట్టుబడులు, మార్కెట్ విస్తరణ, ఉపాధి కల్పన వంటి అనేక విషయాలపై అమెరికా భారత్‌లు ఒక స్పష్టమైన అవగాహనతో ఉన్నాయి. ఉగ్రవాదాన్ని కలిసికట్టుగా నిర్మూలించడం ఎంత ముఖ్యమో, ప్రపంచ మార్కెట్‌లో చైనా దూకుడు తగ్గించడం కూడా అంతే ముఖ్యమని ఇరు దేశాలు భావిస్తున్నాయి. అమెరికా,చైనా దేశాల మధ్య పెరుగుతున్న స్పర్థలు, వాణిజ్య పోటీ భారత్‌కు ఎంతో ఉపకరిస్తుందనడంలో సందేహం లేదు. అంతేకాక అమెరికా టెక్నాలజీ సంస్థలకు భారత్‌లో లభిస్తున్న అతి పెద్ద వినియోగ మార్కెట్, బహిరంగ డేటా వరప్రదాయినిగా కనిపిస్తోంది. టెక్నాలజీ రంగంలో వస్తున్న మార్పులను వినియోగించుకోకపోతే ఆర్థికాభివృద్ధి సాధ్యం కాదని అందరికీ తెలుసు. ఈ క్రమంలో ఎలాంటి సవాళ్లనయినా తిప్పికొట్టగలగాలి.

# ఏపీకి టెస్లా.....?

## ప్రపంచ కుభేరుడికి ఆఫర్లే.. ఆఫర్లు..

న్యూఢిల్లీ,, ఆంధ్ర ప్రగతి ఫిబ్రవరి 22:
ప్రపంచ కుభేరుడు ఎలాన్ మస్క్ కు చెందిన ఈవీ కార్ల కంపెనీ టెస్లా కోసం దేశంలో పలు రాష్ట్రాలు పోటీపడుతున్నాయి. ఇప్పటికే ఢిల్లీ, ముంబైల్లో కొన్ని స్థలాలు చూసినట్లు ప్రచారం జరుగుతోంది. అయితే ఆ స్థలాలు అవుట్ లెట్ల కోసమేనంటూ టెస్లా ప్రతినిధులు చెబుతున్నారు. మరోవైపు భారత మార్కెట్లోకి ప్రవేశానికి సిద్ధమవుతున్న సంస్థ ఇప్పటికే నియామకాల ప్రక్రియ మొదలు పెట్టింది. దీంతో టెస్లా కంపెనీ ప్లాంట్ ను దక్కించుకునేందుకు పలు రాష్ట్రాలు ప్రయత్నాలు చేస్తున్నాయి. ప్రధానంగా ఉత్తరాది రాష్ట్రాలు గుజరాత్, మహారాష్ట్ర చురుగ్గా పావులు కదుపుతుండగా, టెస్లాను ఏపీకి రప్పించేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు రంగంలోకి దిగారు. ఇప్పటికే మంత్రి నారా లోకేశ్ ద్వారా ఓ సారి టెస్లా ప్రతినిధులతో చర్చించిన ఏపీ ప్రభుత్వం.. ఈవీ కార్ల కంపెనీ స్థాపనకు ఏపీ అనుకూలంగా ఉంటుందని తాజాగా మరో లేఖ రాసింది. అంతేకాకుండా ఆ సంస్థను ఏపీకి రప్పించేందుకు భారీ ఆఫర్లు ప్రకటించేందుకు సిద్ధమవుతున్నట్లు ప్రచారం జరుగుతోంది. అమెరికాకు చెందిన దిగ్గజ ఎలక్ట్రిక్ వాహనాల తయారీ సంస్థ టెస్లా. ప్రస్తుతం అమెరికా నుంచే ఈ కార్లు దిగుమతు అవుతున్నాయి. అయితే దిగుమతి సుంకాలు ఎక్కువగా ఉండటం వల్ల టెస్లా కార్ల ధర ఎక్కువగా ఉంటోంది. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ సైతం భారత్ లో అధిక దిగుమతి సుంకాలు వల్ల తమ ఉత్పత్తులు అమ్ముకోలేకపోతున్నామని ఇటీవల ఆవేదన వ్యక్తం చేసిన విషయం తెలిసిందే. ఇక కార్ల మార్కెట్ కు దేశంలో ఎక్కువ అవకాశాలు ఉండటంతో స్థానికంగా పరిశ్రమ స్థాపించి ఉత్పత్తి చేస్తే భారత మార్కెట్లో పుంజుకోవచ్చని టెస్లా భావిస్తోంది. దీంతో దేశంలో ప్లాంట్ ఏర్పాటుకు




అనువైన ప్రదేశాలను పరిశీలిస్తోంది. అయితే టెస్లా పరిశ్రమ వల్ల ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పెరిగే అవకాశం ఉన్నందున దేశంలో పలు రాష్ట్రాలు తీవ్రంగా పోటీ పడుతున్నాయి. టెస్లాను తమ రాష్ట్రాల్లో ఏర్పాటు చేస్తే అన్ని వనరులు సమకూరుస్తామని మహారాష్ట్ర, గుజరాత్ ప్రభుత్వాలు ఒత్తిడి చేస్తున్నట్లు పారిశ్రామిక వర్గాల్లో టాక్ నడుస్తోంది. అయితే ఈ రెండు రాష్ట్రాలను వెనక్కి నెట్టేస్తూ ఏపీ ఈ రేసులోకి దూసుకొచ్చిందని చెబుతున్నారు. టెస్లా యాజమాన్యాన్ని టెంప్ట్ చేసేలా ఏపీ ప్రభుత్వం పలు ఆఫర్లు ఇస్తున్నట్లు చెబుతున్నారు. ప్రధానంగా అమెరికా నుంచి దిగుమతుల కోసం టెస్లాకు ఏకంగా ఓ పోర్టు అప్పగిస్తామని ప్రతిపాదించినట్లు ప్రచారం జరుగుతోంది. టెస్లా ప్లాంట్ ను రాష్ట్రానికి తెచ్చేందుకు గత ఏడాది నుంచే ఏపీ ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తోందని చెబుతున్నారు. గత అక్టోబరులో అమెరికా పర్యటనకు వెళ్లిన మంత్రి నారా లోకేశ్ టెస్లా చీఫ్ ఫైనాన్షియల్ ఆఫీసర్ వైభవ్ తనేజాతో సమావేశమయ్యారని గుర్తు చేస్తున్నారు. టెస్లాను ఏపీకి రప్పించేందుకు రాష్ట్ర ఎకనామిక్ డెవలప్మెంట్ బోర్డు (ఈడీబీ) అవసరమైన స్థలాన్ని అందించేందుకు సిద్ధంగా ఉన్నట్లు చెబుతోంది. రాష్ట్రానికి పోర్ట్ కనెక్టివిటీ ఉండటంతో సముద్ర మార్గం ద్వారా టెస్లా దిగుమతులు, ఎగుమతులకు సౌకర్యంగా ఉంటుందని ప్రభుత్వం సూచిస్తోందని చెబుతున్నారు. అంతేకాకుండా దేశంలో ఎలక్ట్రానిక్ వాహనాలకు ప్రస్తుతం దక్షిణాది రాష్ట్రాల్లో గిరాకీ ఉంది. ప్రస్తుతం దేశంలో అమ్ముడవుతున్న ఈవీ కార్లలో 60 శాతం తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు, కేరళ రాష్ట్రాల్లోనే ఉన్నాయని అంటున్నారు. దీంతో దక్షిణాదిలో టెస్లా ప్లాంట్ ప్రారంభిస్తే దేశంలో వేగంగా ఉనికిని చాటుకునే అవకాశం ఉందని ఏపీ ప్రభుత్వం సలహా ఇస్తోంది. ఫ్యాక్టరీ ఏర్పాటుకు అన్నివనరులు సమకూర్చుతామని, పూర్తి సహకారం అందిస్తామని ప్రతిపాదిస్తోంది. ఏపీ ఆఫర్లతో ఇతర రాష్ట్రాలు వెనకడుగు వేస్తున్నాయని చెబుతున్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నుంచి పెట్టుబడుల వేటకు అధిక ప్రాధాన్యమిస్తోంది. ఇప్పటికే రాష్ట్రంలో రూ.7 లక్షల కోట్ల విలువైన పెట్టుబడులకు ఎంవోయూలు జరిగాయి. కొద్దిరోజుల్లో ఈ పెట్టుబడులు గ్రౌండింగ్ అయ్యేలా ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తోంది. పరిశ్రమల స్థాపనకు అవసరమైన అన్ని అనుమతులను సింగిల్ విండోలో పరిష్కరిస్తోంది. ఈ నేపథ్యంలో టెస్లాను కూడా ఏపీలో పెట్టేలా ఒత్తిడి చేస్తోంది. ఇందుకోసం కేంద్ర ప్రభుత్వంలో తనకు ఉన్న పలుకుబడిని ముఖ్యమంత్రి చంద్రబాబు వాడుకుంటున్నారు. ప్రస్తుత రాజకీయ పరిస్థితుల్లో చంద్రబాబు మాటకు ప్రధాని మోదీ కూడా అధిక ప్రాధాన్యమిస్తుండటంతో టెస్లా ఏపీకి వచ్చే అవకాశాలు ఎక్కువగా కనిపిస్తున్నాయని అంటున్నారు.

# మారని ఎయిర్ ఇండియా తీరు

### విరిగిన సీట్లో గంటన్నర ప్రయాణించా

### కేంద్రమంత్రి చౌహాన్ అసహనం




న్యూఢిల్లీ,, ఆంధ్ర ప్రగతి ఫిబ్రవరి 22:
ప్రముఖ విమానయాన సంస్థ ఎయిర్ ఇండియా తీరుపై కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ మండిపడ్డారు. టాటాల చేతికి వచ్చినా పనితీరులో మార్పు రాలేదని అన్నారు. ఇంత అధ్వానంగా ఉంటుందని ఊహించలేక పోతున్నానని అన్నారు. ఇటీవల భోపాల్ నుంచి దిల్లీకి ప్రయాణించిన సందర్భం లో తనకు విరిగిపోయిన సీటు కేటాయించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇలాంటి చర్యలు ప్రయాణికులను మోసం చేయడమే అవుతుందని వ్యాఖ్యానించారు. ఎయిర్ ఇండియా నిర్వహణను టాటా గ్రూప్ తీసుకున్న తర్వాత ఎయిర్‌లైన్స్ సేవలు మెరుగుపడతాయని అనుకున్నానని.. కానీ అది తన అపోహనని అర్థమయ్యిందని మంత్రి అసహనం వ్యక్తంచేశారు. విమానం ఎక్కిన వెంటనే నేను బుక్ చేసుకున్న సీటు విరిగి ఉండడంతో ఆశ్చర్యపోయాను. దీనిపై ఎయిర్‌లైన్స్ సిబ్బందిని ప్రశ్నించగా.. ఈ సమస్యను యాజమాన్యం ఆలస్యంగా గుర్తించిందని..ఈ సీటు టికెట్‌ను ప్రయాణికులకు విక్రయించకూడదని ఆదేశించిందని తెలిపారు. విమానంలో అదొక్కటే కాకుండా మరిన్ని సీట్లు కూడా సరిగా లేవని సిబ్బంది చెప్పారని కేంద్రమంత్రి సోషల్ మీడియా వేదికగా పేర్కొన్నారు. తోటి ప్రయాణికులు తమ సీట్లలో కూర్చోమని ఆఫర్ చేశారని అన్నారు. కానీ వారికి ఇబ్బంది కలిగించడం ఇష్టంలేక తాను అదే విరిగిపోయిన సీట్‌లోనే గంటన్నర పాటు కూర్చొని ప్రయాణించానని తెలిపారు. ప్రయాణికుల నుంచి పూర్తి ఛార్జీలు వసూలు చేసి, అసౌకర్యమైన సీట్లు కేటాయించడం ప్రయాణికులను మోసం చేసినట్లు కాదా అని మండిపడ్డారు. భవిష్యత్తులో అయినా ఎయిర్ ఇండియా యాజమాన్యం తమ ప్రయాణికులను ఇటువంటి అసౌకర్యానికి గురికాకుండా చర్యలు తీసుకుంటుందా లేదంటే వారి అవసరాన్ని సొమ్ము చేసుకోవడానికి వాడుకుంటుందా అని ప్రశ్నించారు. కేంద్రమంత్రి ట్వీట్‌పై ఎయిర్‌లైన్స్ స్పందిస్తూ.. ఆయనకు కలిగిన అసౌకర్యానికి క్షమాపణలు చెప్పింది. భవిష్యత్తులో ఇటువంటి ఘటనలు జరగకుండా తగిన చర్యలు తీసుకుంటామని పేర్కొంది. 1932లో టాటా గ్రూప్ టాటా ఎయిర్ సర్వీసెస్ పేరుతో ఎయిర్ ఇండియాను స్థాపించగా.. స్వాతంత్ర్యం÷-ర వచ్చాక 1953లో అప్పటి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ ఈ సంస్థను జాతీయం చేశారు. సుమారు 69 ఏళ్ల తర్వాత 2022లో ప్రభుత్వం విమానయాన సంస్థ ఎయిరిండియాను టాటా గ్రూప్‌నకు అధికారికంగా అప్పగించింది.

---------------

# కృష్ణా జలాలపై రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలు సరికాదు

### ఏపీకి క్షమాపణ చెప్పాలన్న బిజెపి నేత

కర్నూలు, ఆంధ్ర ప్రగతి ఫిబ్రవరి 22:
తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై ఏపీ బీజేపీ నేత విష్ణువర్ధన్‌రెడ్డి ధ్వజమెత్తారు. కృష్ణా జలాలను ఏపీ దోపిడీ చేస్తుందని రేవంత్‌రెడ్డి అనడం దారుణం అన్నారు. కర్నూలులో ఆయన మీడియాతో మాట్లాడారు. ఏపీ ప్రజలను, రైతులను దోపిడీ దొంగలుగా చిత్రీకరించడం దారుణం అని.. ఒక సీఎంగా ఉండి ఇలా మాట్లాడడం సహేతుకమేనా అని నిలదీశారు. శ్రీశైలం డ్యామ్ నిర్మాణం ఎవరి త్యాగాలతో నిర్మించారో రేవంత్ రెడ్డికి తెలియదా అని అడిగారు. ప్రజలను మోసం చేసి రేవంత్ రెడ్డి అధికారంలోకి వచ్చారు. ఏపీ తన కాళ్ల మీద నిలబడుతుంది. కేంద్రంతో సఖ్యతగా ఉంటూ నిధులు తెచ్చుకుంటున్నారు. తెలంగాణలో ఒక్క స్కీమ్ కూడా అమలు చేసే పరిస్థితి లేదు. ఏపీ, తెలంగాణ మధ్య కావాలనే జల వివాదాలు సృష్టిస్తున్నారు. రేవంత్ రెడ్డి కపట నాటకం ఆడుతున్నారు. రేవంత్ రెడ్డి బేషరతుగా ఏపీ ప్రజలకు క్షమాపణ చెప్పాలి. రేవంత్ రెడ్డిని సీఎం పదవి నుంచి దింపుతారని పత్రికల్లో కథనాలు వస్తున్నాయి. అందుకే రేవంత్ రెడ్డి ఇలా మాట్లాడుతున్నారా?, అయినా దేశంలో కాంగ్రెస్ పని అయిపోయింది. దేశంలో 22 రాష్టాల్లో బీజేపీ అధికారంలో ఉంటే కాంగ్రెస్ ఉన్న రాష్ట్రాల్లో కూడా అధికారం కోల్పోతుందని విష్ణువర్ధన్‌రెడ్డి అన్నారు.



# మనసులో మాలిన్యం ప్రమాదం!



తిరుమల,:మన ఆలోచనల్లో స్వచ్ఛత లేకపోతే, ఎన్ని ఆలయాలు సందర్శించి, ఎంతమంది దేవుళ్లను మొక్కుకున్నా లాభం లేదు. మాలిన్యంతో దేవుడిని పూజించినా ఫలితం ఉండదు. మరకత మాణిక్యాలతో అలంకరించి, సుగంధ పూలతో, వేద మంత్రాలతో పూజించినా పుణ్యం సంప్రాప్తించదు. మనసులో మాలిన్యం పెట్టుకుని స్వార్ధంతో వ్యవహరించే వారిని భగవంతుగు కూడా దగ్గరకు రానీయడు. సమస్త జీవరాశి పట్ల కారుణ్య భావన కలిగి ఉండాలంటారు ద్రష్టలు. సాటి మనుషులను చిన్న చూపు చూసే మానవులు, జీవ జంతుజాలం పట్ల ఉదాత్తంగా, సమదృష్టితో ఎలా వ్యవహరించగలరు?ఈ భూమ్మీదకు వచ్చిన వాళ్లందరూ రక్తసంబంధం లేకపోయినా, మనకు భ్రాతృ సమానులే. అందరిలో తనను చూసుకునే వ్యక్తి ఉన్నత వ్యక్తిత్వం గల ఉత్తముడు. వయసుతో పాటు మనసు పరిధి విస్తృతం కావాలి. భూమ్మీద ముక్తి సంపాదించుకునే మార్గాలు ఇన్ని ఉన్నా, కారుచీకట్లో కొట్టుమిట్టాడటం మనిషికే చెల్లింది.'ఎక్కడో ఏదో ఉందని కాక, ఇక్కడే భూమ్మీద, ఈ జన్మతో దాన్ని సాధించడమే జన్మ సార్ధకత' అని తెలుసుకుంటే ముముక్షు భావనలు మనలో అంకురించినట్లే!ప్రతి మనిషిలోనూ ఈ మానవత్వ భావనలు వెల్లివిరిస్తే, భూలోకమే ముక్తిదాయక వనం. సర్వత్రా పరిశుద్ధాత్మలు సంచరించే పుణ్యస్థలమై స్వర్గతుల్యమై విలసిల్లుతుంది. సర్వేజనా సుఖినో భవంతు అన్న ఆర్యోక్తిని అంతా పాటించాలి.

# కలెక్టరేట్లో ఉయ్యాలవాడ నరసింహారెడ్డి 178వ వర్ధంతి.




**ఆంధ్రప్రగతి నంద్యాల ఫిబ్రవరి22:** ప్రముఖ స్వాతంత్ర సమరయోధులు, రేనాటి సూర్యుడుగా కొలవబడే ఉయ్యాలవాడ నరసింహారెడ్డి దేశం కోసం చేసిన త్యాగనిరతిని డిఆర్ఓ రాము నాయక్ కొనియాడారు. శనివారం కలెక్టరేట్ లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ లో స్వాతంత్ర సమరయోధుడు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి 178వ వర్ధంతి సందర్భాన్ని పురస్కరించుకొని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. రెడ్డి సేవా సంఘం ప్రతినిధులు రామకృష్ణారెడ్డి, మనోహర్ రెడ్డి, తిరుపం రెడ్డి, సాయిరాం రెడ్డి, శివకుమార్ రెడ్డి, కలెక్టరేట్ ఏవో రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా డిఆర్ఓ రాము నాయక్ మాట్లాడుతూ బ్రిటిష్ పాలకులను ఎదిరించి సాయుధ పోరాటం చేసిన విప్లవ వీరుడు ఉయ్యాలవాడ నరసింహారెడ్డిని ప్రతి ఒక్కరూ స్మరించుకోవాలన్నారు. సాంప్రదాయ వ్యవసాయ వ్యవస్థలో బ్రిటిష్ వారు చేసిన మార్పులకు వ్యతిరేకంగా నరసింహారెడ్డి నిరసన తెలిపారన్నారు. 1806 నవంబర్ 24న కర్నూలు జిల్లాలోని రూపన గుడిలో జన్మించి స్వాతంత్ర సాధన కోసం బ్రిటిష్ పాలకులతో వ్యతిరేకంగా పోరాటం చేసి 1847 ఫిబ్రవరి 22న వీరమరణం పొందారన్నారు.

# శ్రీశైలంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా గుడి పరిసరాలను పరిశీలన.

**-కంపార్ట్మెంట్లలో వేచి ఉన్న భక్తులు సమయమనం పాటిస్తూ దర్శనం చేసుకోవాలి.**

**-విధులలో ఉన్న సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా ఉండాలి.**

**-అడిషనల్ ఎస్పి ఎన్. యుగంధర్ బాబు**



ఆంధ్ర ప్రగతి నంద్యాల జిల్లా ఫిబ్రవరి 22: నంద్యాల జిల్లా అడిషనల్ ఎస్పీ అడ్మిన్ ఎన్. యుగంధర్ బాబు శ్రీశైలం నందు జరుగుచున్న మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా శ్రీశైలంనకు వచ్చు భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాటు చేసిన క్యూలైన్స్,గుడి పరిసరాలు మొదలగు వాటిని పరిశీలించి అక్కడ విధులలో ఉన్న ఆలయ అధికారులకు మరియు పోలీస్ అధికారులకు ,సిబ్బందికి పలు సూచనలు చెయ్యడం జరిగింది.

క్యూలైన్ లలో వేచివున్న భక్తులకు మంచి నీరు, టాయిలెట్స్ ఇలా కనీస సదుపాయాలు కల్పించాలి.

కంపార్ట్మెంట్లలో వేచి ఉన్న భక్తులు సమయమనం పాటిస్తూ ఎలాంటి తొక్కిసలాటకు తావు లేకుండా దర్శనం చేసుకోవాలని సూచించారు. భక్తులకు ఏదైనా అనారోగ్య సమస్యలు ఏర్పడితే మందులు అంబులెన్స్ సౌకర్యం అందుబాటులో ఉంచుకోవాలి. క్యులైన్స్ లలో ఎలాంటి తొక్కిసలాట జరుగకుండా అక్కడ విధులలో ఉన్న సిబ్బందికి అప్రమతంగా ఉండాలి. ఆలయ పరిసరాల్లో బందోబస్తు లో ఉన్న సిబ్బంది అధికారులు నిరంతరము అప్రమత్తంగా ఉంటూ ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలి.క్యూలైన్ లలో వేచివున్న భక్తులకు దర్శనంనకు ఎంత సమయం పడుచున్నది సహేతుకమైన కారణాలను మైక్ ల



ద్వారా సమాచారం అందించాలి.

ఈ కార్యక్రమంలో జిల్లా అడిషనల్ ఎస్పీ తో పాటు టెంపుల్ ఏ ఈ వేణు , స్పెషల్ బ్రాంచ్ సిబ్బంది పాల్గొన్నారు.

# నబి స్పోర్ట్స్ అకాడమీ క్రికెట్ అకాడమీని సందర్శించిన ఎన్ఎండి ఫిరోజ్.





ఆంధ్ర ప్రగతిని నంద్యాల ఫిబ్రవరి 22: నంద్యాల టెక్కే భరతమాత గుడి వద్ద ఉన్న నబి స్పోర్ట్స్ అకాడమీ (ఎన్ఎస్ఏ) కు తెలుగుదేశం పార్టీ నంద్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండి ఫిరోజ్ విచ్చేయడంతో అకాడమీ కోచ్ గౌస్ మరియు క్రీడాకారులు ఆయనకు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఎన్ఎండి ఫిరోజ్ చిన్నారులతో కలిసి క్రికెట్ ఆడి వారిని ఉత్సాహపరిచారు. నంద్యాలలో ఒక క్రికెట్ అకాడమీ ఏర్పాటు చేసి దాదాపు 100 మంది క్రీడాకారులకు శిక్షణ అందిస్తున్న నిర్వాహకులను అభినందించారు. ప్రతి విద్యార్థి జీవితంలో క్రీడల ప్రాముఖ్యత ఎంతో ఉందని, అవి మానసికంగా, శారీరకంగా దృఢతను అందిస్తాయని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎన్ఎండి ఫిరోజ్ మాట్లాడుతూ నేటి తరం పిల్లలు ఆన్లైన్ గేమ్స్‌కు ఆకర్షితులవుతున్న నేపథ్యంలో, ఔట్‌డోర్ గేమ్స్‌లో పాల్గొనాలని, ప్రతిభ గల క్రీడాకారులకు తాను ఎల్లప్పుడూ అండగా ఉంటానని, వారి ప్రతిభను జాతీయ, అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం, ప్రతిభ గల క్రీడాకారులను అభినందించి బహుమతులు అందజేశారు.ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నంద్యాల పట్టణ అధ్యక్షులు మనియార్ ఖలీల్ , మాజీ కౌన్సిలర్లు మిద్దె చిన్న ఉసేని , కృపాకర్ , ఇతర తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, క్రీడాకారులు, అకాడమీ నిర్వాహకులు, కోచ్‌లు తదితరులు పాల్గొన్నారు.

# సైన్స్ కార్నివల్ ఫెస్ట్ లో పాల్గొన్న ఎన్ఎండి ఫిరోజ్.

ఆంధ్ర ప్రగతి నంద్యాల ఫిబ్రవరి 22: నంద్యాల పట్టణం నబి నగర్ నందు గల రాయల్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ ఆధ్వర్యంలో నిర్వహించిన సైన్స్ కార్నివల్ ఫెస్ట్ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా నంద్యాల జిల్లా టిడిపి ప్రధాన కార్యదర్శి ఎన్ఎండి ఫిరోజ్ ముఖ్య అతిథిగా హాజరై సైన్స్ కార్నివల్ ఫెస్ట్ కార్యక్రమాన్ని ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఎన్ఎండి ఫిరోజ్ మాట్లాడుతూ "చిన్నారుల మెదడుల్లో శోధించు – సాధించు" అనే తత్వాన్ని పెంపొందిస్తూ విజ్ఞానం ద్వారా శోధనలు చేస్తూ, భవిష్యత్‌ను నిర్మించుకునేలా విద్యార్థులను ప్రోత్సహిస్తున్న రాయల్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ యాజమాన్యాన్ని అభినందించారు. అదే విధంగా నంద్యాల ప్రైవేట్ స్కూల్స్ యాజమాన్యం నంద్యాలలో ఎన్ఎండి ఫరూక్ గారి గెలుపులో కీలక పాత్ర పోషించారని వారందరికీ ఆయన కృతజ్ఞతలు తెలిపారు. తెలుగుదేశం పార్టీ ప్రభుత్వం అధికారంలోకి రావడానికి సహకరించిన ప్రతి ఒక్కరికీ ఎల్లప్పుడూ అండగా ఉంటానని ఈ సందర్భంగా వారు స్పష్టం చేశారు. ఈ సైన్స్ ఫెస్ట్‌లో



విద్యార్థులు వివిధ విజ్ఞాన శాస్త్ర ప్రాజెక్టులను రూపొందించి, వాటి ప్రాముఖ్యతను స్వయంగా వివరించడం ఎంతో అభినందనియమన్నారు. ఇలాంటి కార్యక్రమాలు ప్రతి పాఠశాలలో నిర్వహించాలని పిలుపునిచ్చారు. "శాస్త్ర విజ్ఞానం మాత్రమే భవిష్యత్తుకు మార్గనిర్దేశం చేయగలదు, కొత్త అవకాశాలను అందించగలదని ఎన్ఎండి ఫిరోజ్ ఈ సందర్భంగా తెలిపారు. అనంతరం, సైన్స్ ఫెయిర్‌లో అత్యుత్తమ ప్రదర్శన చేసిన విద్యార్థులను ప్రోత్సహించేందుకు బహుమతుల ప్రదానం చేయడం జరిగింది. ఎన్ఎండి ఫిరోజ్ విజేతలకు బహుమతులను అందజేస్తూ, "ఈ చిన్నారులు శాస్త్ర పరిశోధనల పట్ల ఆసక్తిని




కొనసాగిస్తూ, భవిష్యత్‌లో గొప్ప శాస్త్రవేత్తలుగా ఎదగాలని వారు ఆకాంక్షించారు.

ఈ కార్యక్రమంలో రాయల్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ డైరెక్టర్ డాక్టర్ .యాకుబ్, కరెస్పాండంట్ ఇషాక్ వలి, ఏపీపీయూఎస్ఎంఏ జిల్లా అధ్యక్షులు బిజ్జం సుబ్బారెడ్డి ,నవభారత్ స్కూల్ కరెస్పాండెంట్ హుస్సేన్ ,మొయిన్ ,వికాస్ స్కూల్ కరెస్పాండెంట్ షాహీంషా వలి, సాయివాణి స్కూల్ కరెస్పాండెంట్ హుస్సేన్ బాషా, నలంద స్కూల్ కరెస్పాండెంట్ ఉత్తెజ్, నేషనల్ స్కూల్ ఖాజాహుస్సేన్, అభ్యుదయ హుస్సేన్ వలి,రవి, ఆల్ఫా స్కూల్ ఇర్ఫాన్ మరియు పాఠశాల ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# కలిసి కట్టుగా నంద్యాల జిల్లా అభివృద్ధికి కృషి చేద్దాం.!

**-ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరిని మర్యాద పూర్వకంగా కలిసిన బీజేపీ జిల్లా అధ్యక్షులు అభిరుచి మధు.**






ఆంధ్ర ప్రగతి నంద్యాల ఫిబ్రవరి 22: నంద్యాల జిల్లా అభివృద్ధికి టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీలు కలిసి కట్టుగా పనిచేద్దాం అని నంద్యాల పార్లమెంట్ సభ్యురాలు, లోక్ సభ టీడీపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ డాక్టర్ బైరెడ్డి శబరి పిలుపు నిచ్చారు.శనివారం నంద్యాల బొమ్మలసత్రం ఎంపీ కార్యాలయంలో బీజేపీ జిల్లా అధ్యక్షులు అభిరుచి మధు ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరిని మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్చం అందించి శాల్వతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఎంపీ డాక్టర్ శబరి మాట్లాడుతూ ఉమ్మడి ప్రభుత్వంపై ప్రజలు ఎంతో ఆశ లు పెట్టుకున్నారని వారి ఆశలు వమ్ముచేయకుండా , సమస్యలు పరిష్కరించేందుకు టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీలు ఉమ్మడి ప్రణాళికతో ముందుకు సాగుదాం అన్నారు. ప్రతి పథకం అమలు, నామినేటెడ్ పదవుల్లో బీజేపీ, జనసేన కు 5 శాతం అమలు చేయాల్చిందేనని ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి స్పష్టం చేశారు. ఉమ్మడి పార్టీ సమావేశాలు కూడా నిర్వహించడం వల్ల ప్రజలకు మేలు జరుగుతుందన్నారు. భవిష్యత్ ప్రణాళికతో ప్రజలకు మేలు చేసేందుకు ముందుకు నడుద్దాం అని అన్నారు. ఈ కార్యక్రమం లో బనగానపల్లె బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ బి వి సుబ్బారెడ్డి, నంద్యాల మూడవ పట్టణ బీజేపీ అధ్యక్షులు లక్ష్మి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# పర్యావరణ పరిరక్షణ పై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం.

**ఆంధ్ర ప్రగతి ఆళ్లగడ్డ ఫిబ్రవరి 22:** ఆళ్లగడ్డ ఎద్దుల పాపమ్మ ప్రభుత్వ పాఠశాలను శనివారం నేషనల్ గ్రీన్ కాప్స్ రాష్ట్ర డైరెక్టర్ స్రవంతి (ఐఏఎస్) ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలో విద్యా బోధన, రికార్డులను పరిశీలించారు. అనంతరం జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ విద్యార్థులు ప్రధానంగా పర్యావరణ పరిరక్షణపై అవగాహన కలిగి ఉండాలన్నారు. పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యతగా గుర్తించాలని డైరెక్టర్ స్రవంతి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నేషనల్ గ్రీన్ క్యాప్స్ అధికారులు సత్యనారాయణ, ప్రసాద్, జిల్లా కోఆర్డినేటర్ చంద్రశేఖర్ రెడ్డి, క్లస్టర్ కోఆర్డినేటర్ శ్రీనివాసులు, మండల విద్యాశాఖ అధికారి శోభా వివేకపతి, పాఠశాల హెచ్ఎం వీరరాఘవయ్య తదితరులు పాల్గొన్నారు.

# శాంతిరాం మెడికల్ కాలేజ్ అండ్ జనరల్ హాస్పిటల్లో14వ గ్రాడ్యుయేషన్ డే.

ఆంధ్ర ప్రగతి నంద్యాల ఫిబ్రవరి 22:

శనివారం నాడు శాంతిరాం మెడికల్ కళాశాల నందు 14వ గ్రాడ్యుయేషన్ డే ప్రోగ్రాం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా డాక్టర్ వి ఎస్ ఆర్ ఆంజనేయులు (ఫార్మర్ ప్రిన్సిపల్ అండ్ ప్రొఫెసర్ ఆఫ్ అనస్తీసియాలజీ) పాల్గొని వైద్య విద్యార్థులకు వైద్య వృత్తిలో ఎలా రాణించాలి తెలియజేశారు. మరియు శాంతిరాం మెడికల్ కాలేజ్ చైర్మన్ డాక్టర్ మిద్దె శాంతిరాముడు వైద్య వృత్తి గురించి మాట్లాడుతూ ప్రతి ఒక్క వైద్యుడు మానవసేవయే మాధవసేవ అనే నినాదంతో గ్రామీణ ప్రాంతాల్లో పేద ప్రజలకు వైద్య సేవలు అందించాలని కొనియాడారు.పాల్గొన్నవారు: 1 డాక్టర్ వి ఎస్ ఆర్ ఆంజనేయులు

2. డాక్టర్ మిద్దె శాంతిరాముడు (కళాశాల చైర్మన్)




3. డాక్టర్ మాధవి లత (కళాశాల వైస్ చైర్మన్)
4. డాక్టర్ రవి బాబు (కళాశాల మేనేజింగ్ డైరెక్టర్)
5. డాక్టర్ వసంత్ ఆర్ చవాన్ (కళాశాల ప్రిన్సిపల్)
6. డాక్టర్ మధుసూదన్ రెడ్డి (కళాశాల మెడికల్





సూపరిండెంట్)

7.మిద్దె రఘురాం (కళాశాల ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్)

అలాగే శాంతిరాం మెడికల్ కాలేజ్ అండ్ జనరల్ హాస్పిటల్ అన్ని విభాగాల హెచ్ ఓ డి లు పాల్గొన్నారు.

# మోటార్ సైకిల్ ఢీ వ్యక్తి మృతి

ఆంధ్ర ప్రగతి నంద్యాల ఫిబ్రవరి 22: మద్యం మత్తులో దినేష్ రెడ్డి అనే వ్యక్తి అధిక వేగంతో బైక్ను ఢీకొనడంతో నిండు ప్రాణం బలి అయింది. టేక్కే మార్కెట్ యార్డ్ సమీపంలో శు క్రవారం రాత్రి 9:30 గంటలకు స్టాంప్ వెనడర్ గా పనిచేసే శంకర్(45) బైకుపై ఇంటికి తిరిగి వెళుతుండగా మద్యం మత్తులో దినేష్ రెడ్డి మరో ఇద్దరూ బైకుపై అధిక వేగంతో వచ్చి ఢీకొట్టారు. శంకర్ బండి పై నుండి బలంగా కింద పడడంతో తలకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే స్థానిక ప్రజలు హుటాహుటిన శంకరును నంద్యాల ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో కర్నూలు ప్రభుత్వాసుపత్రికి తరలించగా శనివారం తెల్లవారుజామున 5:30 కు కోలుకోలేక మృతి చెందాడు. మృతునికి భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారు.



## ముఖ్యమంత్రి సహాయ నిధి పంపిణీ చేసిన ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి.




ఆంధ్ర ప్రగతి నంద్యాల ఫిబ్రవరి 22:
ఆళ్లగడ్డ నియోజకవర్గం ఉయ్యాలవాడ గ్రామానికి చెందిన తాతిరెడ్డి శివలక్ష్మమ్మ అను భాధితురాలుకు శనివారం నంద్యాల ఎంపీ కార్యాలయంలో ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి ముఖ్యమంత్రి సహాయ నిధి రూ. 98,0395 వేల చెక్కును భాధితురాలికి అందించారు. పేద రోగులకు సీఎం సహాయ నిధి ఎంతో భరోసా ఇస్తుందని, సీఎం చంద్రబాబు సీఎం రిలీఫ్ ఫండ్ వెంటనే మంజూరు చేస్తూ భాధితులకు అండగా నిలుస్తున్నారని ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి అన్నారు.

## డబ్ల్యూహెచ్వో సేవలకు పూర్తి సహకారం అందిస్తాం.!

**- ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి.**



ఆంధ్ర ప్రగతి నంద్యాల ఫిబ్రవరి 22:
ఆంధ్రప్రదేశ్, భారతదేశ వ్యాప్తంగా ఇమ్యూనేజేషన్, డిసిజ్ సర్వేలెన్స్ లో డబ్ల్యూ హెచ్ ఓ చేపట్టే కార్యక్రమాలు విస్తరించాలని, కేంద్ర ప్రభుత్వం డబ్ల్యూ హెచ్ ఓ సేవలకు పూర్తి సహకారం అందిస్తుందని నంద్యాల పార్లమెంట్ సభ్యురాలు, లోక్ సభ టీడీపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ డాక్టర్ బైరెడ్డి శబరి అన్నారు. శనివారం నంద్యాల బొమ్మలసత్రం నంద్యాల ఎంపీ కార్యాలయంలో డబ్ల్యూ హెచ్ ఓ అధికారుల బృందం ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరిని మర్యాద పూర్వకంగా కలిచారు.
ఈ సందర్భంగా ఎంపీ శబరి మాట్లాడుతూ గ్రామాలకు, అడవుల్లోని చెంచు బిడ్డలకు డబ్ల్యూ హెచ్ ఓ సేవలు విస్తరించాలన్నారు. రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాల సహకారం మీ సేవలకు ఉంటుందని, తన సహకారం కూడా ఉంటుందని ఎంపీ శబరి హామీ ఇచ్చారు. నంద్యాల జిల్లాలో డబ్ల్యూ హెచ్ ఓ సేవలకు తన సహాయ సహకారం అందిస్తామన్నారు.
ఈ సమావేశంలో డబ్ల్యూ హెచ్ ఓ ఎన్ పి ఎస్ ఎన్ ఎస్ఆర్టిఎల్ డాక్టర్ సందీప్ పాటిల్, గుంటూరు ఎస్ ఎం ఓ డాక్టర్ భవాని, కర్నూలు ఎస్ఎంవో డాక్టర్ వరుణ్ తదితరులు పాల్గొన్నారు.

## ఊట కాల్వ సమస్య పరిష్కరించాలని ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి కి రైతుల వినతి.

**-రైతులను కష్టపెడితే ఊరుకునేదిలేదు. -ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి.**



ఆంధ్ర ప్రగతి నంద్యాల ఫిబ్రవరి 22: నంద్యాల జిల్లాలో రైతులను ఇబ్బంది పెడితే ఊరుకునేదిలేదని నంద్యాల ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి స్పష్టం చేశారు. ఆళ్లగడ్డ మండలం బత్తులూరు, బృందావనం, విజయనగరం గ్రామాల్లోని ఊట కాల్వ శిదిలావస్థకు చేరుకోవడంతో మా గ్రామాలకు కేసి కెనాల్ ద్వారా ఆయకట్టుకు సాగునీరు, తాగు నీరు అందడం లేదని, ఊట కాల్వ సమస్యకు పరిష్కారం చూపించాలని ఆయా గ్రామాల రైతులు నంద్యాల ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరికి వినతి పత్రం ద్వారా శనివారం నంద్యాల ఎంపీ కార్యాలయంలో మొరపెట్టుకున్నారు. రైతుల సమస్యలు విన్న వెంటనే ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి స్పందించి కే సి కెనాల్ ఈ ఈ ప్రతాప్ తో ఫోన్ ద్వారా మాట్లాడుతూ బత్తులూరు, బృందావనం, విజయనగరం గ్రామాల ప్రజలను ఇబ్బందిపెట్టే, నష్టం కలిగించే ఊట కాల్వ సమస్యను వెంటనే పరిష్కరించాలని, 15 రోజుల్లో సమస్యకు పరిష్కారం చూపకుంటే తాను ఊట కాల్వ వద్దకు వెళ్లుతానని ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి కేసి కెనాల్ ఈ ఈ కి స్పష్టం చేశారు. రైతులు ఇబ్బంది పడకుండా చూడాలని ఎంపీ ఆదేశించారు. ఎంపీ శబరికి వినతి పత్రం అందించిన బత్తులూరు గ్రామ పెద్దలు కె. చిన్న వెంకటసుబ్బారెడ్డి, పార్థసారథిరెడ్డి, ఇరిగెల మహేశ్వరరెడ్డి, బి. నాగశేషుడు తదితరులు ఉన్నారు.

## శ్రీశైల పాదయాత్రను విజయవంతం చేయండి.!

**-నంద్యాల ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి.**




ఆంధ్ర ప్రగతి నంద్యాల ఫిబ్రవరి 22'
శ్రీశైల భ్రమరాంబ, మల్లికార్జున స్వామి వార్ల మహా శివ రాత్రి బ్రహ్మోత్సవాలలో భాగంగా ఆదివారం ఉదయం ప్రారంభమయ్యే పాదయాత్రను జయప్రదం చేయాలని నంద్యాల ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి కోరారు. శనివారం నంద్యాల బొమ్మలసత్రంలోని ఎంపీ కార్యాలయంలో ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి అధ్యక్షతన శ్రీశైల పాదయాత్ర విజయవంతం కోసం కో - ఆర్డినేషన్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఎంపీ శబరి మాట్లాడుతూ నంద్యాల, పాణ్యం, నందికొట్కూరు, శ్రీశైలం నియోజకవర్గాలలోని బైరెడ్డి అభిమానులు, టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు తన వెంట నల్లమల అడవిలో సుమారు 50 కిలోమీటర్ల దూరం కాలినడక ద్వారా శ్రీశైల మల్లన్న జాతరకు తరలివస్తున్నారని అన్నారు. తన వెంట వచ్చే వారికి ఎలాంటి అసౌకర్యం కలుగకుండా తాగునీరు, ఆహారం, మందులు అందుబాటులో ఉంచామని అన్నారు. అటవీ చట్టాలకు అనుగుణంగా తమ ఆధ్యాత్మిక శ్రీశైలం పాదయాత్ర సాగుతుందన్నారు. ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసి అటవీ అధికారుల అనుమతి వాహనాల ద్వారా ఏర్పాటు చేస్తున్నాం అన్నారు. కాలనడక న వచ్చే భక్తులు, అభిమానులు ప్రభుత్వ అధికారులకు సహకరించి వారి సహకారం కూడా తీసుకోవాలని, పర్యావరణ కూడా కాపాడుకుందాం అని ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి సూచించారు. ఈ సమావేశంలో ఎంపీ కార్యాలయం ఇంచార్జి నరహరి విశ్వనాథ్ రెడ్డి, నంద్యాల మండల టీడీపీ నాయకురాలు బైరెడ్డి శంకరమ్మ, భగీరథరెడ్డి, పోలూరు నాగేశ్వరరెడ్డి, గణపం పుల్లారెడ్డి, దినేష్ రెడ్డి, మనోజ్ రాయల్, బి ఎస్ ఎన్ ఎల్ సలహా కమిటీ సభ్యులు పెరుమాళ్ళ విజయకుమార్, పాణ్యం శ్రీనివాసయాదవ్, అజయ్, సూరి, వార్డు ఇంచార్జి శ్రీనివాసయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## నంద్యాలకు బయలుదేరిన మహానంది ఈశ్వరుని ఉత్సవ మూర్తులు



ఆంధ్ర ప్రగతి మహానంది ఫిబ్రవరి 22:



మహా నందీశ్వరుని ఉత్సవ మూర్తులు మహానంది క్షేత్రం నుండి నంద్యాలలోని బ్రహ్మనందీశ్వర స్వామి ఆలయానికి బయలుదేరాయి. ఆలయ ఈవో నల్ల కాలువ శ్రీనివాసరెడ్డి ఏ ఈ ఓ మధు వేద పండితులు రవిశంకర్ అవధాని నాగేశ్వర శర్మ తదితరులు ప్రత్యేక పూజల అనంతరం మహానందీశ్వరుని ఉత్సవ మూర్తులు నంద్యాలకు బయలుదేరి వెళ్లాయి. మహానంది క్షేత్రంలో జరిగే మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా నంద్యాలలో వెలసిన బ్రహ్మనందీశ్వర స్వామిని పెళ్లి పెద్దగా ఆహ్వానించడానికి వెళ్లారు. తిరిగి ఆదివారం రాత్రికి బ్రహ్మనందీశ్వర స్వామి ఉత్సవ మూర్తులతో సహా మహానందీశ్వర స్వామి ఉత్సవ మూర్తులు మహానందికి చేరుకోనున్నాయి. ఈనెల 24 సోమవారం ధ్వజా ఆరోహణంతో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు మహానంది క్షేత్రంలో ప్రారంభం కానున్నాయి.

## ఆనారోగ్యంతో మృతి చెందిన మహిళ కుటుంబానికి ఆర్థిక సాయం.




ఆంధ్ర ప్రగతి శిరివెళ్ళ ఫిబ్రవరి 22: మండల పరిధిలోనిగుంప్రమన్ దీన్నే గ్రామంలోనీ ఎస్సీ మాల కాలనీలో కాసారపు జేసమ్మ కోడలు కాసారపు శివ భార్య కాసారపు సారక్క అనారోగ్యంతో మృతి చెందిన సమాచారం తెలుసుకున్న వైసీపీ సీనియర్ నాయకుడు, మండల సెక్రెటరీ వరికూటీ. రాజారెడ్డి సారక్క మృతదేహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. మహిళ మృతి చెందిన కుటుంబాన్ని, రాజారెడ్డి పరామర్శించి భూస్థాపితం ఖర్చుల నిమిత్తం, 5000 రూపాయలు ఆర్థిక సహాయం కుటుంబానికి అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ మాజీ సర్పంచ్ సైకం నరసింహారెడ్డి , సర్పంచ్ తలారి జానకి చిన్న స్వామి, వైస్ సర్పంచ్ పద్మావతి నడిపి భాస్కర్ రెడ్డి, ఎక్స్ నీటి సంఘం అధ్యక్షుడు పడమటి చిన్న హుస్సేన్ రెడ్డి, తలారిరాంపుల్లయ్య తదితరులు ప్రగాఢ సానుభూతులు తెలియజేశారు.

## నూతనంగా నిర్మించిన మస్జిద్-ఏ-నూరుల్లా ఖాద్రి ప్రారంభోత్సవంలో ఎన్ఎండి ఫిరోజ్.





ఆంధ్ర ప్రగతి నంద్యాల ఫిబ్రవరి 22: ఈ మస్జీద్ నందు జుమ్మా ప్రార్థనలో పాల్గొన్న అనంతరం ఎన్ఎండి ఫిరోజ్ మాట్లాడుతూ, మస్జిద్ యొక్క ప్రాముఖ్యతను వివరిస్తూ ఇది ముస్లిం సమాజాన్ని ఏకం చేసే కేంద్రంగా మారాలని, ఈ ప్రార్థనాలయం ద్వారా సామాజిక ఐక్యత పెంపొందించాలని ఆకాంక్షించారు. మదరస విద్యార్థులకు విద్య ప్రాముఖ్యత గురించి వివరించి, నంద్యాలలో విద్యాభివృద్ధికి తన వంతు సహాయ సహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయని హామీనిచ్చారు. నంద్యాల ముస్లిం ప్రజలకు ఎల్లప్పుడూ తోడుగా ఉంటానని, వారి సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు. ఈ సందర్భంలో, మదరసలో హాఫిజ్-ఏ-ఖురాన్ పూర్తి చేసిన విద్యార్థులను ప్రత్యేకంగా సన్మానించి, వారి భవిష్యత్తుకు దీవెనలు అందజేశారు. మస్జీద్ ఇమాం మౌలానా అబ్దుల్ సలాం కి మసీద్ కమిటీ సభ్యులు, మరియు మస్జిద్ నిర్మాణంలో తోడ్పాటునందించిన దాతలందరికీ ఘనంగా సత్కారం చేశారు.

## పుత్తడి ధరలకు రెక్కలు



పసిడి పరుగులు ఇప్పట్లో ఆగే సూచనలు కనిపించడం లేదు. రోజురోజుకు బంగారం ధర పెరుగుతోంది. పెళ్లిళ్ల సీజన్ కావడంతో పుత్తడి ధరలకు రెక్కలు వచ్చాయి. వరుసగా రెండవ రోజు కూడా పెరిగిన ధరలతో బంగారం సామాన్యులకు షాక్ ఇస్తోంది. రెండు తెలుగు రాష్ట్రాల్లోని ప్రధాన నగరాలు హైదరాబాద్, విజయవాడలో శుక్రవారం ధరలతో పోలిస్తే 22 క్యారెట్ల పసిడి ధర రూ. 200 మేర పెరిగి రూ. 84007 స్థాయికి చేరింది. అటు 24 క్యారెట్ల బంగారం ధర రూ. 330 మేర పెరిగింది. దీనితో ప్రస్తుతం పది గ్రాముల ధర రూ. 87770గా పలుకుతోంది. అయితే, పసిడి షాక్ ఇచ్చిన వేళ వెండి ధరలు కాస్త తగ్గి కిలో రూ. 107000గా ఉంది.

## బుక్కాపురం గ్రామ ప్రజలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలి.

ఆంధ్ర ప్రగతి నంద్యాల ఫిబ్రవరి 22:
అబ్బిపురం గిరిజన కాలనీ లో మౌలిక వసతులు. కల్పించి ఐటిడీఏ లో చేర్చాలని. బుక్కాపురం గ్రామ ప్రజలకు రోడ్డు పోరంబోకులో ఇళ్ల స్థలాలు ఇవ్వాలని కోరుతూ సిపిఐ ఆధ్వర్యంలో మహానందిలో శ్రీశైలం శాసనసభ్యులు బుడ్డా రాజశేఖర్ రెడ్డి నిర్వహించిన ప్రజాదర్బార్ లో వినతిపత్రం ఇవ్వడం జరిగిందని సిపిఐ మండల కార్యదర్శి. ఆర్. సామేలు. అబ్బిపురం శాఖ కార్యదర్శి. లక్ష్మయ్య. సిపిఐ సహాయ కార్యదర్శి దస్తగిరి. తెలిపారు. ఈ సందర్భంగా సిపిఐ మండల కార్యదర్శి ఆర్ సామేలు మాట్లాడుతూ.
మహానంది మండలంలోని. అబ్బీ పురం గ్రామ గిరిజన కాలనీని ఐటీడీఏ లో చేర్పించి మౌలిక వసుతులు కల్పించాలని అనేకసార్లు అధికారులకు. అధికార పార్టీ నాయకులు విన్నవించిన ఏమాత్రం కదలిక లేకపోవడంతో శాసనసభ్యులు బుడ్డా రాజశేఖర్ రెడ్డి గారు గిరిజన కాలనీ సందర్శించి గిరిజన సమస్యలను పరిస్కారం చేసి కాలనీని ఐ టీ డి



ఏ చేర్చాలని అదేవిధంగా బుక్కాపురం గ్రామంలో ఇల్లు లేని నిరుపేదలు వందలాదిమంది ఉన్నారని గతంలో రోడ్డు పోరంబోకు స్థలంలో ప్రస్తుత శాసనసభ్యులు హయాంలోని ఇళ్ల స్థలాలు పట్టాలు కూడా ఇవ్వడం జరిగిందని ఇప్పుడు కూడా అర్హులైన నిరుపేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని కోరారు.
మహానంది మండలంలో వందలాది ప్రభుత్వ భూములు ఏ పార్టీ అధికారంలో ఉంటే ఆ నాయకులు ప్రభుత్వ భూములను కబ్జాలు చేసి రెవిన్యూ



అధికారులకు మామూలు ఇచ్చి పట్టాలు ఆన్లైన్ అడంగల్ లో చే పించినారని పేదలకు ఇళ్లస్థలాల కోరితే రెవెన్యూ అధికారులు స్పందించకపోవడం దుర్మార్గమని ప్రభుత్వ భూములను సిపిఐ పార్టీ పేదలకు ఇళ్లస్థలాలు కోసం భూ పోరాటాలు నిర్వహించి గ్రామాలు నిర్మించిన చరిత్ర ఉందని ఇప్పటికైనా అధికారులు ప్రభుత్వ భూములు గుర్తించి అర్హులైన నిరుపేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని లేని పక్షంలో సిపిఐ ఆధ్వర్యంలో ప్రభుత్వ భూములలో ఎర్రజెండాలు పాతి పేదలకు ఇండ్ల స్థలాలు ఇస్తామని పై నాయకులు తెలిపారు.

## భూ వివాదాలపై ఎమ్మెల్యేకు వినతులు.

ఆంధ్ర ప్రగతి మహానంది ఫిబ్రవరి 22: మహానందిలోని మహానంది మండల తాసిల్దార్ కార్యాలయం వద్ద జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డికి భూ వివాదాలపై పలువురు రైతులు వినతులను అందజేశారు. మసీదుపురం గ్రామానికి చెందిన ఒక రైతు గత ప్రభుత్వం తమ భూములను ఆన్లైన్ నుండి తొలగించిందని కేవలం తాము తెదేపాకు చెందినవారమని తొలగించారని న్యాయం చేయాలని ఎమ్మెల్యేకు విన్నవించారు. మసీదుపురం గ్రామంలో తాగునీటి సమస్య నెలకొందని స్థానిక తెలుగుదేశం నాయకులు ఎమ్మెల్యేకు వివరించారు. సార్ నా భూమిని ఇతరుల సర్వే నెంబర్ లో జత చేశారని నేను ఉన్నది ఒక సర్వే నెంబర్ అయితే మరో



సర్వే నెంబర్లు నా భూమి చూపించారని ఎమ్మెల్యేకు పలువురు రైతులు దరఖాస్తులు అందజేశారు. పలువురు రైతులకు సంబంధించి భూములు రీ సర్వేలో తమకు తెలియకుండా మార్పులు చేర్పులు చేశారని వీటిని సవరించి న్యాయం చేయాలని ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి కి దరఖాస్తులను అందజేశారు. సమస్యలు పరిష్కరిస్తామని ఇక్కడ పరిష్కారం కానీ వాటిని ఉన్నతాధికాలా దృష్టికి తీసుకొని వెళ్లి పరిష్కరిస్తామన్నారు. ఏవైనా సమస్యలు ఉన్న పరిష్కారం కాకపోతే ప్రభుత్వం దృష్టికి తీసుకొని పోయి భూ సమస్యల పరిష్కరించడానికి చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి డి ఎ వో మురళీకృష్ణ తాసిల్దార్ రమాదేవి ఎంపీడీవో దౌలత్ వ్యవసాయ శాఖ ఏఓ నాగేశ్వర్ రెడ్డి, ఎంపీపీ యశస్విని మహానంది గ్రామ సర్పంచ్ చలం చలం శిరీష ఇతర శాఖల అధికారులతో పాటు ఎక్సైజ్ ఎస్సై బ్రహ్మయ్య తదితరులు పాల్గొనగా మహానంది ఎస్ఐ రామ్మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తును తాసిల్దార్ కార్యాలయం వద్ద ఏర్పాటు చేశారు.

ప్రతి అక్షరం ప్రజాహితం
ఆంధ్రప్రగతి
తెలుగు దినపత్రిక



## పోలీసులు విధి నిర్వహణలో అప్రమత్తంగా ఉండాలి..!

-భక్తులకు అసౌకర్యం కలగకూడదు.

నంద్యాల జిల్లా ఇంచార్జి ఎస్పీ విక్రాంత్ పాటిల్





ఆంధ్ర ప్రగతి శ్రీశైలం ఫిబ్రవరి 22: శ్రీశైలంలో ఫిబ్రవరి 19 నుంచి మార్చి 1 వరకు మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో అందుకు సంబంధించిన భద్రత ఏర్పాట్ల పై శ్రీశైలంలో నంద్యాల జిల్లా ఇంచార్జి ఎస్పీ విక్రాంత్ పాటిల్ బందోబస్తుకు విచ్చేసిన పోలీసు అధికారులు , సిబ్బంది తో సమావేశం నిర్వహించారు. పలు సూచనలు చేసి దిశా నిర్దేశం చేశారు. పోలీసులు కేటాయించిన ప్రాంతాలలో భాద్యతయుతంగా విధులు ఉండాలన్నారు. భక్తుల పట్ల మర్యాదగా వ్యవహరించాలన్నారు. సమర్ధవంతంగా పని చేయాలన్నారు. ట్రాఫిక్ అంతరాయం లేకుండా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీ మనోజ్ రామ్నాథ్ హెగ్డే ,అడిషనల్ ఎస్పీ అడ్మిన్ ఎన్ యుగంధర్ బాబు, అడిషనల్ ఎస్పీ ఏ ఆర్ చంద్రబాబు, ఆత్మకూరు డిఎస్పి రామంజి నాయక్ ఉన్నారు.


## రాష్ట్ర భవిష్యత్తు కోసం ఆలోచన చేయండి

-గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల పిలుపు



**గుడివాడ** ఆంధ్ర ప్రగతి ఫిబ్రవరి 22:
రాష్ట్ర భవిష్యత్తు కోసం పట్టభద్రులందరూ ఆలోచన చేయాలని, ఈ నెల 27వ తేదీన జరిగే ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి అభ్యర్థిగా పోటీ చేస్తున్న ఆలపాటి రాజేంద్రప్రసాద్ ను గెల్పించాలని గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము పిలుపునిచ్చారు. ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో భాగంగా శనివారం స్థానిక సత్యనారాయణపురంలోని సిద్దార్థ కళాశాలలో ఉపాధ్యాయులు, పట్టభద్రులను కలిశారు. వార్డులోని పట్టభద్రుల ఇళ్ళకు వెళ్ళి కరపత్రాలను పంపిణీ చేశారు. అనంతరం వెనిగండ్ల మాట్లాడుతూ ఉద్యోగాల కల్పనపై చంద్రబాబు దృష్టిసారించారన్నారు. సంక్షేమ పథకాలను అమలు చేస్తూనే రాష్ట్రాభివృద్ధికి పక్కా ప్రణాళికతో ముందుకు వెళ్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు దింట్యాల రాంబాబు, వార్డు అధ్యక్షుడు కృష్ణారావు, సిద్దార్థ ప్రిన్సిపాల్ చోడవరపు విజయ్ కుమార్, కేవీ కామర్స్ కళాశాల ప్రిన్సిపాల్ కొమ్ము వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## యూట్యూబ్ ఛానల్ ముసుగులో వ్యభిచారం





విజయవాడ ఆంధ్ర ప్రగతి ఫిబ్రవరి 22:
విజయవాడలో యూట్యూబ్ ఛానల్ ముసుగులో స్పా సెంటర్ నిర్వహిస్తున్న బిల్డింగ్‌పై మాచవరం పోలీసులు దాడి చేశారు. వెటర్నరీ కాలనీ సర్వీస్ రోడ్డులో స్టూడియో 9 ( స్పా) సెంటర్‌పై సహచర సిబ్బందితో కలిసి మాచవరం సీఐ ప్రకాష్ దాడులు చేశారు. ఏపీ 23 యూట్యూబ్ ఛానల్ న్యూస్ బిల్డింగ్ నందు స్పా సెంటర్ నడుపుతున్నారని సమాచారం అందడంతో పోలీసులు రైడ్ చేశారు. 10 మంది మహిళలు, 13 మంది విటులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. పట్టుబడిన మహిళలంతా ఇతర రాష్ట్రాలకు చెందినవారుగా గుర్తించారు. చలసాని ప్రసన్న భార్గవ్.. యూట్యూబ్ ఛానల్‌ను అడ్డం పెట్టుకుని స్పా సెంటర్‌ను నిర్వహిస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. ప్రస్తుతం భార్గవ్ పరారీలో ఉన్నాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు.. నిందితుడి కోసం గాలిస్తున్నారు.

## ఫైబర్ నెట్ లో చంద్రబాబు భారీ అవినీతి చేశారు: గౌతమ్ రెడ్డి

విజయవాడ ఆంధ్ర ప్రగతి ఫిబ్రవరి 22:
లాభాల బాటలో ఉన్న ఫైబర్ నెట్ ను చంద్రబాబు నిర్వీర్యం చేసేందుకు కుట్ర పన్నారని ఫైబర్ నెట్ కార్పొరేషన్ మాజీ ఛైర్మన్ పూనూరు గౌతమ్ రెడ్డి మండిపడ్డారు. ఫైబర్ నెట్ ను ప్రైవేట్ కంపెనీలకు అప్పగించేందుకు రంగం సిద్ధం చేశారని ఆరోపించారు.
వైసీపీ హయాంలో ఫైబర్ నెట్ ను లాభాల బాటలోకి తెచ్చామని... అలాంటి సంస్థను నాశనం చేసేందుకు యత్నిస్తున్నారని గౌతమ్ రెడ్డి విమర్శించారు. 2014-19లోనే ఫైబర్ నెట్ లో చంద్రబాబు భారీ అవినీతి చేశారని... దీనిపై తమ హయాంలో విచారణ జరిపించామని తెలిపారు. చంద్రబాబు అవినీతి, అక్రమాలను సీఐడీ నిరూపించిందని చెప్పారు. ఫైబర్ నెట్ ప్రతి కాంట్రాక్టులో అవినీతి జరిగిందని అన్నారు. ఇప్పుడు సీఎం అయిన తర్వాత తన మీద ఉన్న కేసులను చంద్రబాబు మాఫీ చేయించుకుంటున్నారని తెలిపారు.

## మహిళల రక్షణ కోసం ప్రత్యేక యాప్ : ఏపీ హోంమంత్రి అనిత




విజయవాడ ఆంధ్ర ప్రగతి ఫిబ్రవరి 22:
మహిళల రక్షణ కోసం ప్రత్యేక యాప్ ను అందుబాటులోకి తీసుకురావాలని హోంమంత్రి వంగలపూడి అనిత అధికారులను ఆదేశించారు. డీజీపీ హరీశ్ కుమార్ గుప్తా, ఇతర పోలీస్ ఉన్నతాధికారులతో రాష్ట్ర సచివాలయంలో శుక్రవారం మంత్రి సమీక్ష నిర్వహించారు. బడ్జెట్ ప్రాధాన్యతలకు సంబంధించిన అంశాలతో పాటు రాష్ట్రంలో మహిళలు, చిన్నారుల రక్షణ, తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. హెల్ప్ డెస్కుల ఏర్పాటుపై దిశానిర్దేశం చేశారు. మార్చి 8న మహిళా దినోత్సవం నాడు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా మహిళల రక్షణ కోసం ప్రత్యేక యాప్ ను ప్రారంభించే విధంగా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అంతకు ముందు విజయవాడలోని క్యాంప్ కార్యాలయంలో నర్సరావుపేట ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద్ బాబు ఆధ్వర్యంలో సాయి సాధన చిట్ ఫండ్ బాధితులు మంత్రి అనితను కలిశారు. నరసరావుపేటలో సాయి సాధన చిట్ ఫండ్ ఇటీవల బోర్డు తిప్పేయడంతో సుమారు రూ.200 కోట్ల మేర మోసం జరిగిందని, బాధితుల్లో పేద, మధ్యతరగతి ప్రజలే ఎక్కువగా ఉన్నారని వివరించారు. బాధితులకు సరైన న్యాయం చేయాలని ఎమ్మెల్యే కోరారు. ఘటనలో నిందితులను అరెస్టు చేయడం జరిగిందని, త్వరలోనే బాధితులకు న్యాయం జరిగేలా చూస్తామని మంత్రి హామీ ఇచ్చారు. సాయి సాదన చిట్ ఫండ్ కేసు విచారణకు సిట్ ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు.

# ప్రజా సమస్యల పరిష్కారానికే ప్రజా దర్బార్..!

-ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి.





ఆంధ్ర ప్రగతి మహానంది ఫిబ్రవరి 22:
ప్రజల సమస్యలు పరిష్కారానికి ప్రజా దర్బార్ కార్యక్రమం నిర్వహిస్తున్నామని శ్రీశైలం నియోజకవర్గం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి పేర్కొన్నారు. శనివారం మహానందిలోని తహసిల్దార్ కార్యాలయం వద్ద నిర్వహించిన ప్రజా దర్బార్ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. అనంతరం మండలంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై వినతి పత్రాలను స్వీకరించారు. అలాగే గాజులపల్లె టిడిపి నాయకులు గంగవరపు ఉమా మహేశ్వర్ రెడ్డి ఆధ్వర్యంలో,గాజులపల్లె గ్రామంలోని మెట్ట యందు డ్రైన్లు సరిగ్గా లేక,డ్రైనేజీ మురుగునీరు ముందుకు పారే విధంగా లేకపోవడంతో, ఈ సమస్యతో ఇబ్బందులు పడుతున్నామని, మహాదేవపురం రోడ్డు యందు వర్షాలు కురిసినప్పుడు వర్షపు నీరు రోడ్డుపై నిలబడి ఇబ్బందులు పడుతున్నామని,రోడ్డుకు, డ్రైన్లకు నిధులు మంజూరు చేసి, సమస్యలను పరిష్కరించాలని స్థానికుల ఆధ్వర్యంలో ఎమ్మెల్యే వినతి పత్రం అందజేశారు. శ్రీశైలం దేవస్థానం మాజీ ధర్మకర్తర రవి స్వామి ఆధ్వర్యంలో, బసాపురం గ్రామ సమీపంలోని రైల్వే ట్రాక్ వద్ద ఉన్న పొలాలకు విద్యుత్ సౌకర్యం కల్పించాలని ఎమ్మెల్యేకు వినతి అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రజా సమస్యలపై అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపి, సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ రమాదేవి, మండల అధ్యక్షురాలు బుడ్డారెడ్డి యశస్విని,కేసి కెనాల్ ప్రాజెక్ట్ కమిటీ చైర్మన్ బన్నూరు రామలింగారెడ్డి, మండల స్పెషల్ ఆఫీసర్ మురళీకృష్ణ, ఎంపీడీవో మహమ్మద్ దౌలా, ఆలయ ఈవో ఎన్. శ్రీనివాసరెడ్డి, మండల వ్యవసాయ అధికారి నాగేశ్వర్రెడ్డి, విద్యుత్ శాఖ ఏఈ ప్రభాకర్ రెడ్డి, మహానంది ఎస్ ఐ ఎన్. రామ్మోహన్ రెడ్డి, మండల విద్యాశాఖ అధికారి రామసుబ్బయ్య, ఏపీవో మనోహర్, ఆర్ ఐ సుబ్బారావు, సర్పంచ్ అస్లాం భాష, టిడిపి నేతలు నరాల చంద్రమౌళీశ్వర్ రెడ్డి, గంగవరపు శశికళ కొండారెడ్డి, గంగిశెట్టి మల్లికార్జున, పాణ్యం శ్రీనివాసులు, జనసేన మండల అధ్యక్షుడు మారెడ్డి రామయ్య, జనసేన నాయకులు నల్లబోతుల మల్లికార్జున, తదితరులు పాల్గొన్నారు.

## ఏ.పీ ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ నంద్యాల జిల్లా, పట్టణ కమిటీ ఎన్నికలు.

-రాయలసీమ జోనల్ అప్స అధ్యక్షులు దండే దస్తగిరి ఆధ్వర్యంలో జరిగిన కమిటీ ఎన్నికలు.





ఆంధ్ర ప్రగతి నంద్యాల ఫిబ్రవరి 22:
రాయలసీమ రీజియన్ ఆంధ్రప్రదేశ్ ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ అధ్యక్షులు దండే దస్తగిరి ఆధ్వర్యంలో బాలచంద్ర సమత స్కూల్ నందు జరిగిన ప్రైవేట్ స్కూలు కరస్పాండెంట్ ల సమావేశంలో జిల్లా నూతన కమిటీ మరియు పట్టణ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగిందని అప్స ఎన్నికల కమిటీ పరిశీలకుడు పడకండ్ల సుబ్రహ్మణ్యం తెలిపారు. ఈ సందర్భంగా దండే దస్తగిరి మాట్లాడుతూ బడ్జెట్ పాఠశాలల అభ్యున్నతికి, ప్రైవేటు పాఠశాలల సమస్యలను పరిష్కరించడానికి ఈ కమిటీలు దోహదపడతాయని, ప్రైవేటు పాఠశాల కరస్పాండెంట్లకు ఏ సమస్య వచ్చినా ఆంధ్రప్రదేశ్ ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ (అప్స) తరపున అండగా ఉంటామని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ జిల్లా గౌరవ అధ్యక్షులుగా బత్తిన వెంకటేశ్వర్లు, అధ్యక్షులుగా ఎం.జీ.వీ రవీంద్రనాథ్, కార్యదర్శిగా వాసుదేవారెడ్డి, కోశాధికారిగా సి. ఆరిఫ్, ఉపాధ్యక్షులుగా ఎస్.నాగరాజ రావు, సహాయ కార్యదర్శిగా రాజనాల సుధాకర్ నీ ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగిందని తెలిపారు. అలాగే నంద్యాల పట్టణ గౌరవ అధ్యక్షులుగా ఎస్. రసూల్ ఆజాద్, అధ్యక్షులుగా సమత బాలచంద్రుడు, కార్యదర్శిగా శ్రీనివాస పాండే, కోశాధికారిగా న్యాయమతుల్లా, ఉపాధ్యక్షులుగా టైటాస్ విజయకుమార్, సహాయ కార్యదర్శిగా శ్రీనివాసులు, ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగిందని తెలిపారు. రాబోయే రోజులలో ప్రైవేటు పాఠశాలల తరపున మంచి కార్యక్రమాలు, అలాగే బడుగు, బలహీన వర్గాలకు చెందిన పిల్లలకు తక్కువ ఫీజులలో విద్యాబోధన గురించి ఈ సమావేశంలో చర్చించినట్టు పడకండ్ల సుబ్రహ్మణ్యం తెలిపారు.

# కోరం లేకుండా విజయ డైరీ బోర్డు మీటింగ్ ఎలా జరుపుతారు..?

-ఎమ్మెల్యే భూమా అఖిల ప్రియ సంచలన వ్యాఖ్యలు.



ఆంధ్ర ప్రగతి నంద్యాల ఫిబ్రవరి 22:
కోరం లేకుండా బోర్డు మీటింగ్ ఎలా జరుపుతారు అంటూ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ ప్రశ్నించారు. కోరం కావాలంటే పదిమంది సభ్యులు ఉండాలి మీరు 9 మంది సభ్యులతోనే కోరం ఉందంటూ ఎలా బోర్డు మీటింగ్ పెట్టుకుంటారని ప్రశ్నించారు. ముగ్గురు డైరెక్టర్లను రద్దు చేస్తూ అలాగే వాళ్ళ సొసైటీలను రద్దు చేస్తామంటే అంటున్నారు ఎందుకు వాళ్ళ సొసైటీలను రద్దు చేస్తున్నారో మాకు తెలపాలని ఎమ్మెల్యే భూమా అఖిల ప్రియ ప్రశ్నించారు. మధుసూదన్ రెడ్డిని జనరల్ బాడీ మీటింగ్ కి రాకుండా ఉన్న కూడా మీరెందుకు యాక్షన్ తీసుకోవడం లేదని నేను అడుగుతున్నాను. నన్నెవరూ ప్రశ్నించవద్దు నేను మోనార్క్ అంటే ఇక్కడ చూస్తూ ఎవరు ఊరుకోరు. ఉదయం ఏమో మీడియా ముందు గట్టిగా మాట్లాడే ఈ చైర్మన్ రాత్రి అయ్యేసరికి మా ఇంటి దగ్గరికి ఆడవాళ్లను రాయబారంగా పంపిస్తాడు కాదని చెప్పి చైర్మన్ చెప్పమను. ఊరిలో ఈ కూర్చినది నేనే ఉండాలంటూ మాట్లాడితే మాత్రం ఊరుకునేది లేదు కుర్చీలు ఎవ్వరికి శాశ్వతం కాదు డైరెక్టర్ల సొసైటీలు రద్దు చేస్తే ప్రజలే నీకు బుద్ధి చెబుతారని ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ అన్నారు. నేను మా తమ్ముడు ఏదో బకాయి ఉన్నాము అంటూ నోటీసులు పంపించాను అంటూ మాట్లాడుతున్నాడు. గత ఐదు సంవత్సరాలు మేము బకాయి ఉంటే ఎందుకు నోటీసు ఇవ్వలేదు అని నేను అడుగుతున్నాను. ఈ విజయ డైరీ గురించి రేపు అసెంబ్లీలో నేను మాట్లాడబోతున్నాను సీఎం చంద్రబాబు నాయుడు లోకేష్ అన్న ఏం నిర్ణయం తీసుకుంటారో వారికే చెప్తారు. గత కొద్దిసేపటి క్రితం చైర్మన్ ఏదో ప్రెస్ మీట్ లో నా గురించి మాట్లాడడానికి తెలిసింది ఏదైనా తప్పుగా మాట్లాడి ఉంటే మాత్రం కచ్చితంగా చట్టపరమైన చర్యలు తీసుకుంటానని ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ తెలిపారు..

## మహాశివరాత్రి సందర్భంగా శివ క్షేత్రాలలో ఏర్పాటుచేసే రెడ్ క్రాస్ వైద్య శిబిరాలకు మందులు పంపిణీ.




ఆంధ్ర ప్రగతి నంద్యాల ఫిబ్రవరి 22:
ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా ప్రెసిడెంట్ గౌరవ జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మహాశివరాత్రి సందర్భంగా నంద్యాల జిల్లాలోని అన్ని శైవ క్షేత్రాలలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసే ఉచిత వైద్య శిబిరాలకు అవసరమయ్యే మందులను అక్కడ వైద్య శిబిరం నిర్వహించే నిర్వాహకులకు పంపిణీ చేయడం జరిగిందని ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా చైర్మన్ దస్తగిరి పర్ల తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ మారుతి కుమార్, ట్రెజరర్ నాగేశ్వరరావు, జిల్లా కార్యవర్గ సభ్యుడు ఉస్మాన్ భాష, ప్యాట్రన్ సభ్యుడు సుధా మోహన్ రెడ్డి, మహానంది మండల రెడ్ క్రాస్ కన్వీనర్ అమర్నాథ్ సభ్యుడు స్వాములు బండి ఆత్మకూరు మండల రెడ్ క్రాస్ కన్వీనర్స్ నూర్ భాషా శ్రీనివాసులు బనగానపల్లె మండలం రెడ్ క్రాస్ కన్వీనర్ సైపుల్ల తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా దస్తగిరి మాట్లాడుతూ శ్రీశైలం పుణ్యక్షేత్రం పరిధిలో పేచెరువు, నంది మండపం, కైలాస ద్వారం తదితర ప్రాంతాలలో మరియు మహానంది, ఓంకారం, భోగేశ్వరం, యాగంటి, డోన్ బుగ్గ పుణ్యక్షేత్రాలలో వైద్య శిబిరాలు ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు.
వైస్ చైర్మన్ మారుతి కుమార్ .. మాట్లాడుతూ అవసరమయ్యే మందులు అందజేసిన జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి కి కాత్యాయని మెడికల్ స్టోర్ వారికి రెడ్ క్రాస్ సభ్యులకు ధన్యవాదాలు తెలియజేశారు.
జిల్లా కార్యవర్గ సభ్యుడు ఉస్మాన్ భాష మాట్లాడుతూ.. ఈ వైద్య శిబిరాలలో మొట్టమొదటిసారిగా శ్రీశైలంలో రెడ్ క్రాస్ మొబైల్ హెల్త్ వ్యాన్ భక్తులకు అందుబాటులో ఉంటుందని అందులో ఈసీజీ ఆక్సిజన్ కాన్సన్ట్రేషన్ తదితర అత్యాధునిక పరికరాలు ఉంటాయని ప్రభుత్వ వైద్యుల పర్యవేక్షణలో ఈ వాహనం భక్తుల కొరకు వినియోగిస్తామన్నారు.
మహానంది అమర్ యాగంటి సైపుల్ల ఓంకారం శ్రీనివాసులు షరీఫ్ లు మాట్లాడుతూ శ్రీశైలం పరిధిలో దాదాపు ఐదు రోజులకు పైగా వైద్య శిబిరాలు ఏర్పాటు చేయడం జరుగుతుందని మిగతా ప్రాంతాల్లో శివరాత్రి రోజు నుండి మూడు రోజులు పాటు రాత్రి పగలు వైద్య శిబిరాలు రెడ్ క్రాస్ సభ్యుల గ్రామీణ వైద్యుల సహకారంతో నిర్వహిస్తామని తెలిపారు.

# 3 రాష్ట్రాల్లో మోదీ పర్యటన



**న్యూఢిల్లీ:** ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మూడు రోజుల పర్యటన ఆదివారం మొదలవుతుంది. మధ్యప్రదేశ్ బీహార్ అసోం రాష్ట్రాల్లో 23 నుంచి 25 వరకూ ఆయన పర్యటన సాగుతుంది. మధ్యప్రదేశ్‌లో బాగేశ్వర్ ధామ్ మెడికల్ అండ్ సైన్స్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూషన్‌ను మోదీ శంకుస్థాపన చేస్తారు. ఇన్వెస్టర్స్ సమ్మిట్‌ను సోమవారంనాడు ప్రారంభిస్తారు. అసోంలో జుమోయిర్ బినాందిని కార్యక్రమంలో పాల్గొంటారు. అసోంలో టీ పరిశ్రమ, పారిశ్రామికీకరణ జరిగి 200 ఏళ్లు అయిన సందర్భంగా ఈ ఈవెంట్ నిర్వహిస్తున్నారు.

**మధ్యప్రదేశ్‌లో..**

పీఎం పర్యటన వివరాల ప్రకారం, 23వ తేదీన ఆయన మధ్యప్రదేశ్‌లి ఛాతర్‌పూర్ జిల్లాలో పర్యటిస్తారు. మధ్యాహ్నం 2 గంటలకు బాగేశ్వర్ మెడికల్ అండ్ సైన్స్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్‌కు శంకుస్థాపన చేస్తారు. 24వ తేదీ ఉదయం 10 గంటలకు భోపాల్‌లో గ్లోబల్ ఇన్వెస్ట్‌మెంట్ సమ్మిట్‌ను ప్రారంభిస్తారు. 60 దేశాలకు చెందిన ప్రతినిధులు, వివిధ అంతర్జాతీయ సంస్థలకు సంబంధించిన అధికారులు, ఇండియాకు చెందిన 300 మందికి పైగా ప్రముఖ పారిశ్రామిక నేతలు తదితరులు ఈ సమ్మిట్‌లో పాల్గొంటారు.

**బీహార్‌లో...**

ప్రధాని 24వతేదీ ఉదయం 2.15 గంటలకు బీహార్‌లోని భాగల్‌పూర్ చేరుకుంటారు. పీఎం కిసాన్ స్కీమ్ 19వ ఇన్‌స్టాల్‌మెంట్‌ను విడుదల చేస్తారు. పలు అభివృద్ధి ప్రాజెక్టులను ప్రారంభించడం, జాతికి అంకితం చేయడం చేస్తారు.

**అసోంలో..**

ప్రధాని 24వ తేదీ సాయంత్రం 6 గంటలకు గౌహతి చేరుకుంటారు. మెగా ఝుమోయిర్ 2025 ప్రోగ్రాంలో పాల్గొంటారు. 25వతేదీ ఉదయం 10.45 గంటలకు గౌహతిలో జరిగే అడ్వాంటేజ్ అసోం 2.0 ఇన్వెస్ట్‌మెంట్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ సమ్మిట్ 2025లో పాల్గొంటారు. ఈ సదస్సులో వివిధ అంతర్జాతీయ సంస్థలు, గ్లోబల్ లీడర్లు, పెట్టుబడిదారులు, విధాననిర్ణేతలు, పరిశ్రమ నిపుణులు, స్టార్టప్స్, విద్యార్థులు తదితరులు పాల్గొంటారు.

# ఆ విషయంలో మాతో ఆటలొద్దు



చెన్నై:తమిళులు భాష కోసం ప్రాణాలు వదిలారని, ఈ విషయంలో తమతో ఆటలొద్దని ప్రముఖ నటుడు మక్కల్ నీది మయ్యమ్ (ఎంఎన్ఎమ్) అధినేత కమల్‌హాసన్ కేంద్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఎమ్ఎన్ఎమ్ పార్టీ 8వ వ్యవస్థాపక దినం సందర్భంగా కమలహాసన్ మాట్లాడారు. 'తమిళులకు భాష చాలా ముఖ్యమైనది. మాతో ఈ విషయంలో ఆలలొద్దు.భాష కోసం ప్రాణాలు కూడా వదిలేశాం.మా పిల్లలకు కూడా ఏ భాష కావాలో తెలుసు.ఏ భాష కావాలో ఎంపిక చేసుకునే జ్ఞానం వారికి ఉంది'అని పరోక్షంగా కేంద్రం తీసుకువచ్చిన నేషనల్ ఎడ్యుకేషన్ పాలసీ(ఎన్ఈపీ)ని ఉద్దేశించి కమల్ వ్యాఖ్యానించారు. తమిళనాడులో రెండు భాషల విధానం అమలులో ఉండగా ఎన్ఈపీ కింద హిందీతో కలిపి మూడు భాషల విధానాన్ని అమలు చేయాలని కేంద్రం భావిస్తోంది. దీనిని అధికార డీఎంకే తీవ్రంగా వ్యతిరేకిస్తోంది.ఎన్ఈపీ అమలు చేయకపోతే తమిళనాడుకు రావాల్సిన రూ.2152 కోట్ల సమగ్రశిక్షాఅభియాన్ నిధులు నిలిపివేస్తామని కేంద్ర మంత్రి ధర్మేంద్రప్రదాన్ ఇప్పటికే హెచ్చరించారు. ప్రదాన్ చేసిన వ్యాఖ్యలపై ఆందోళన వ్యక్తం చేస్తూ సీఎం స్టాలిన్ ఇప్పటికే ప్రధాని మోదీకి లేఖ కూడా రాశారు. ఈ లేఖపై ప్రదాన్ తిరిగి స్పందించారు. తమిళనాడు ప్రభుత్వం రాజకీయాలు వదిలేసి విద్యార్థుల భవిష్యత్తు కోసం ఆలోచించాలని సూచించారు. ఈ విషయమై తాజాగా ప్రధాని మోదీ కూడా పరోక్షంగా స్పందించారు. దేశంలో భాషల పట్ల శత్రుత్వం సృష్టించొద్దని కోరారు.

# మళ్లీ దడ పుట్టిస్తున్న చైనా



**బీజింగ్ :** చైనా రూపొదించిన రోబో డాగ్, డ్రోన్ మధ్య పోరాట వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయింది. ఇప్పుడు చైనా సైన్యం చేసిన విన్యాసాలు దానికి మరింత ఊతం ఇచ్చాయి. గురువారం(ఫిబ్రవరి20) చైనా పీపుల్స్ లిబరేషన్ ఆర్మీ (ఖఒం) న్యూక్లియర్, బయోలాజికల్ అండ్ కెమికల్ డిఫెన్స్ డ్రిల్‌లో లు, రోబోటిక్ డాగ్‌లను ప్రదర్శించారు. చైనా ఇప్పుడు ఇలాంటి రోబోటిక్ కుక్కలపై దృష్టి సారించింది. రక్షణ రంగంలో ముందుకు సాగడంతో పాటు సైన్యాన్ని బలోపేతం చేసే దిశగా దీనిని ఒక పెద్ద అడుగుగా అభివర్ణిస్తున్నారు.రోబోటిక్ డాగ్‌లు శత్రువులను ఎదుర్కోవడానికి వ్యూహాన్ని మెరుగుపరుస్తాయి. సైనికుల బలిదాన ప్రమాదాన్ని తగ్గిస్తాయి. గత సంవత్సరం కూడా, చైనా తన సైన్యంలో భాగమైన రోబోటిక్ కుక్క లక్షణాలను పరిచయం చేసింది. అవి ఎలా పనిచేస్తాయో తెలుసా, చైనీయులకు ఎన్ని రకాల రోబోటిక్ కుక్కలు ఉన్నాయి, చైనా, కంబోడియా మధ్య ఉమ్మడి సైనిక విన్యాసాల వీడియో విడుదలైంది. రోబో డాగ్ సామర్థ్యాలను వీడియోలో చూపించారు. సరళంగా చెప్పాలంటే, శత్రువుల ఇళ్లలోకి ప్రవేశించి వారిపై దాడి చేయగల సైనికులకు ప్రత్యామ్నాయంగా రోబోట్ కుక్కలను తయారు చేయడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయి. నష్టం జరిగితే తక్కువగా ఉంటుంది. చైనా ఇప్పుడు టెక్నాలజీ సహాయంతో తన సైన్యాన్ని బలోపేతం చేసుకుంటోంది. అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం కలిగిన మానవరహిత వైమానిక వాహనాలు, రోబోట్ కుక్కలు దీనికి ఉదాహరణలు.చైనా రోబో కుక్కలు నడవగలవు. పరుగెత్తవచ్చు. దూకవచ్చు, అడుగడుగునా అడుగులు వేయవచ్చు. అవసరమైనప్పుడు దూకవచ్చు కూడా. అవి అస్సాల్ట్ రైఫిళ్లను కూడా సమర్థవంతంగా నిర్వహిస్తారు. చైనా సైన్యంలో రెండు రకాల రోబో కుక్కలు ఉన్నాయి. మొదటి కుక్క మరింత శక్తివంతమైనది. దీనికి అస్సాల్ట్ రైఫిల్ అమర్చారు. 50 కిలోల బరువున్న ఈ కుక్క తన లక్ష్యాన్ని ట్రాక్ చేస్తున్నప్పుడు తన దిశను కూడా మార్చుకుంటుంది. దాని లక్ష్యం దాని స్థానాన్ని మారుస్తుందని అనుకుందాం. అప్పుడు అది తన స్థానాన్ని మార్చుకుంటూనే తన లక్ష్యాన్ని గురి చూస్తుంది. రెండవ రోబో కుక్క బరువు 15 కిలోలు. దీనిని శత్రువుపై నిఘా పెట్టడానికి, కొన్ని నిర్దిష్ట విషయాలను గుర్తించడానికి ఉపయోగించవచ్చు.ఈ రోబోటిక్ కుక్కలను చైనీస్ స్టార్టప్ కంపెనీ యూనిట్రీ రోబోటిక్స్ అభివృద్ధి చేసిందని అనేక మీడియా నివేదికలలో పేర్కొన్నారు. అయితే, ఆ కంపెనీ దానిని చైనా పీపుల్స్ లిబరేషన్ ఆర్మీకి సరఫరా చేయడానికి నిరాకరించింది. ఈ రోబోటిక్ కుక్కలను ఎక్కడి నుండి తీసుకువస్తున్నారో చైనా సైన్యం కూడా స్పష్టం చేయలేదు.గత సంవత్సరం గోల్డెన్ డ్రాగన్ 2024 వ్యాయామంలో కూడా వీటిని ప్రదర్శించారు. ఈ సైనిక విన్యాసాలను చైనా, కంబోడియా సంయుక్తంగా 2024 మే 16 నుండి 30 వరకు నిర్వహించాయి. ఈ శిక్షణలో, చైనా సైన్యం తన బలాన్ని ప్రదర్శించింది. భూమిపై, ఆకాశంలో తన ఆధునిక ఆయుధాలను మోహరించింది. ఇప్పుడు మరోసారి చైనా రోబోటిక్ కుక్క వార్తల్లో నిలిచింది. గత నెలలో వైరల్ అయిన ఒక వీడియోలో, కుక్క డ్రోన్‌ను లక్ష్యంగా చేసుకుని దాడి చేస్తున్నట్లు కనిపించింది. ఈ వీడియోపై నెటిజన్లు రకరకాలుగా కామెంట్స్ చేస్తున్నారు.

# లౌడ్ స్పీకర్ బ్యాన్ చేశారని..




ఉత్తరప్రదేశ్‌లోని సంభాల్‌లో లౌడ్ స్పీకర్‌లను బ్యాన్ చేస్తూ స్థానిక అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నేపథ్యంలో ఒక మౌలానా(మత పెద్ద) మసీదుపైకి ఎక్కి పెద్దగా అరుస్తూ, ముస్లిం సోదరులంతా నమాజ్‌కు రావాలని పిలుపునిచ్చారు. షాహీ జామా మసీదుపై జరిగిన ఈ ఉదంతానికి సంబంధించిన వీడియో వైరల్‌గా మారింది. కోర్టు తీర్పు అనంతరం సంభాల్‌లోని అన్ని ప్రార్థనా ?స్థలాలు, మత ప్రదేశాలలో లౌడ్ స్పీకర్ల వినియోగాన్ని అధికారులు నిషేధించారు. అయితే ఇప్పుడు వీటిని ఉల్లంఘించినందున పోలీసులు ఆ మసీదుకు చెందిన ముగ్గురు మతపెద్దలపై కేసు నమోదు చేశారు. సంభాల్‌లోని షాహీ జామా ఇమామ్ మసీదు గత కొన్నాళ్లుగా వివాదాల్లో ఉంది. ఈ మసీదు ఉన్న ప్రాంతంలో గతంలో కల్కి ఆలయం ఉండేదని ఒక న్యాయవాది కోర్టులో దావా వేశారు. ఈ నేపథ్యంలో స్థానిక కోర్టు ఈ మసీదు సర్వేకు సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేసింది. ఈ సర్వే రెండవ రోజున పెద్దసంఖ్యలో జనం మసీదు దగ్గరకు చేరుకున్నారు. ఈ నేపథ్యంలో పోలీసులకు జనానికి మధ్య వాగ్వాదం జరిగింది. పరిస్థితులను చక్కదిద్దేందుకు పోలీసులు కాల్పులు జరిపారు. ఈ కాల్పుల్లో నలుగురు మృతిచెందారు. 20 మంది పోలీసులతో పాటు పలువురు గాయపడ్డారు. నాటి నుంచి ఈ వివాదం రగులుతూనే ఉంది. ఇదే సమయంలో స్థానిక పరిపాలనా యంత్రాంగం అల్లర్లకు పాల్పడినవారిపై చర్యలు పట్టింది. సమాజ్‌వాదీ ఎంపీ బార్క్ కూడా ఈ వివాదాల్లో చిక్కుకున్నారు. ఇదిలావుండగా అక్రమ విద్యుత్ కనెక్షన్‌లను తొలగించేందుకు వెళ్ళిన బృందం ఒక పురాతన ఆలయాన్ని కూడా కనుగొంది. ఆలయం చుట్టూ ఒక బావిని కూడా వారు చూశారు. దీని తరువాత సంభాల్‌లో అక్రమ నిర్మాణాల కూల్చివేత మొదలయ్యింది. సమాజ్‌వాదీ పార్టీ ఎంపీ జియావుర్ రెహమాన్ బార్క్ ఇంట్లో కొంత భాగం అక్రమ నిర్మాణం పరిధిలోకి వచ్చింది. దీంతో ఎంపీ ఇంటి మెట్లను సంబంధిత అధికారులు తొలగించారు.

## ప్రధాని మోదీ ప్రిన్సిపల్ సెక్రటరీ-2 గా ఆర్బీబీ మాజీ గవర్నర్



**న్యూఢిల్లీ:** ప్రధాని నరేంద్ర మోదీ ప్రిన్సిపల్ సెక్రటరీ-2గా రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఆర్బీఐ) మాజీ గవర్నర్ శక్తికాంత్ దాస్ నియమితులయ్యారు. శక్తికాంత్ దాస్.. ప్రధాని మోదీ ప్రిన్సిపల్ సెక్రటరీ2గా నియమించడానికి క్యాబినెట్ కమిటీ ఆమోద ముద్ర వేసింది., ఈ మేరకు డిపార్ట్‌మెంట్ ఆఫ్ పర్సనల్ ట్రైనింగ్ శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. తాతా ఉత్తర్వులు ప్రకారం ప్రధాని మోదీ పదవీకాలంతో సమానంగా లేదా తదుపరి ఉత్తర్వులు వచ్చే వరకూ శక్తికాంత్ దాస్ ఈ పదవిలో కొనసాగనున్నారు. అయితే పికె మిశ్రా సెప్టెంబర్ 11, 2019 నుండి ప్రధానమంత్రికి ప్రిన్సిపల్ సెక్రటరీగా ఉన్నారు. భారత రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బీఐ) గవర్నర్ గా సేవలందించిన శక్తికాంత్ దాస్.. గతేడాది డిసెంబర్ రెండో వారంలో తన పదవికి వీడ్కోలు పలికారు.2018 నుంచి ఆయన ఆర్బీఐ గవర్నర్ గా ఉన్నారు. ఆర్బీఐ గవర్నర్ గా ఉర్జిత్ పటేల్ హఠాత్తుగా వైదొలిన క్రమంలో ఆ బాధ్యతల్ని శక్తికాంత్ దాస్ చేపట్టారు. 1980 తమిళనాడు క్యాడర్‌కు ఐఏఎస్ అధికారి అయిన శక్తికాంత్ దాస్.. ఢిల్లీ సెయింట్ స్టెఫెన్స్ కాలేజ్ నుంచి మాస్టర్ డిగ్రీ చేశారు. అనంతరం బర్మింగమ్ యూనివర్శిటీ నుంచి పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్‌లో పీజీ పూర్తి చేశారు. 2016లో మోదీ ప్రభుత్వం ' పెద్ద నోట్ల రద్దు' చేస్తూ నిర్ణయం తీసుకున్న సందర్భంలో ఆయన ఎకానామిక్ అఫైర్స్ సెక్రటరీగా ఉన్నారు.

## విరిగిన సీట్లో మంత్రి ప్రయాణంపై ఏఐని వివరణ కోరిన డీజీసీఏ



**న్యూఢిల్లీ:** భోపాల్ నుంచి ఢిల్లీకి ప్రయాణంలో తనకు విరిగిపోయిన సీటు కేటాయించారంటూ ఎయిర్ ఇండియా నిర్వాకంపై కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ ఆగ్రహం వ్యక్తం చేయడంపై సివిల్ ఏవియేషన్ రెగ్యులేటర్ డీజీసీఏ తక్షణ చర్యలకు దిగింది. వెంటనే వివరణ ఇవ్వాలని ఎయిరిండియాను ఆదేశించింది. దీనికిముందు, ఎయిరిండియా విమానంలో తనకు ఎదురైన అనుభవంపై సోషల్ మీడియాలో శివరాజ్ సింగ్ చౌహాన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. పూర్తి డబ్బులు తీసుకుని అరకొర సౌకర్యాలు కల్పించడం ప్రయాణికులను మోసగించడమేనని అన్నారు. ఎయిరిండియా నిర్వహణ టాటా గ్రూప్ తీసుకున్న తర్వాత సేవలు మెరుగుపడాతాయని అనుకున్నానని, కానీ ఇది తన అపోహేనని అర్థమైందని అసహనం వ్యక్తం చేశారు. విమానం ఎక్కగానే తన సీటు విరిగి ఉండటం చూసి ఆశ్చర్యపోయానని అన్నారు. మరి కొన్ని సీట్లు కూడా సరిగా లేవని సిబ్బంది చెప్పారని, కొందరు తమ సీట్లలో కూర్చోవాలని ఆఫర్ చేశారని చెప్పారు. అయితే వారిని ఇబ్బంది పెట్టడం ఇష్టంలేక విరిగిపోయిన సీటులోనే గంటన్నర ప్రయాణం చేశామని వివరించారు. కేంద్ర మంత్రి ట్వీట్‌పై ఎయిర్‌లైన్స్ వెంటనే స్పందించింది. మంత్రికి కలిగిన అసౌకర్యానికి క్షమాపణలు చెప్పింది. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు జరక్కుండా తగిన చర్యలు తీసుకుంటామని తెలిపింది.

**రామ్మోహన్ నాయుడు స్పందన**

ఈ ఘటనపై పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు నాయుడు స్పందించారు. ఈ విషయమై ఎయిరిండియతో మాట్లాడామని, అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించామని చెప్పారు. మావైపు నుంచి డీజీసీఏ సైతం తగిన చర్యలు తీసుకుంటోందన్నారు. మంత్రి శివరాజ్ సింగ్‌తో వ్యక్తిగతంగా మాట్లాడినట్టు చెప్పారు.

## ఢిల్లీ అసెంబ్లీ సమావేశాలకు రంగం సిద్ధం..



**ఢిల్లీ:** ఢిల్లీ రాష్ట్రంలో కొత్తగా ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత తొలిసారి అసెంబ్లీ సమావేశం కానుంది. ఈ నెల 24వ తేదీన అసెంబ్లీ ప్రత్యేక సమావేశాలు ప్రారంభం కానున్నాయి. ఫిబ్రవరి 24,25,27 వ తేదీల్లో ఢిల్లీ అసెంబ్లీ సమావేశాలు జరుగనున్నాయి. 24వ తేదీన ఎమ్మెల్యేల ప్రమాణ స్వీకారంతో పాటు, అదే తేదీ మధ్యాహ్నం 2 గంటలకు స్పీకర్ ఎన్నిక జరుగనుంది. 25వ తేదీన లెఫ్టినెంట్ గవర్నర్ అసెంబ్లీలో ప్రసంగం ఉటుంది. ఇక 27వ తేదీ గవర్నర్ ప్రసంగంపై ధన్యవాద తీర్మానం చర్చ జరుగనుంది. మరొకవైపు 25వ తేదీన ఆమ్ ఆద్మీ పార్టీ(ఆప్) ప్రభుత్వంలో పెండింగ్ లో ఉంచిన కాగ్ రిపోర్ట్ ను సైతం అసెంబ్లీలో ప్రవేశపెట్టే అవకాశం ఉంది. 25, 27 తేదీల్లో కాగ్ రిపోర్ట్ పై చర్చించే అవకాశాలు కనబడుతున్నాయి. తాము అసెంబ్లీ తొలి సెషన్ లోనే కాగ్ రిపోర్ట్ ను అసెంబ్లీలో ప్రవేశపెడతామని ఢిల్లీ ముఖ్యమంత్రి రేఖా గుప్తా ఇప్పటికే స్పష్టం చేసిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలోనే కాగ్ రిపోర్ట్ ను అసెంబ్లీలో ప్రవేశపెట్టే అవకాశం కనిపిస్తోంది. ప్రభుత్వ నిధులను గత పాలకు దుర్వినియోగం చేశారని, ఎక్సైజ్ పాలసీలో అవతవకలు జరిగాయని కాగ్ నివేదిక పేర్కొన్న తరుణంలో దానికి ప్రాధాన్యత సంతరించుకుంది. గతంలో ప్రతిపక్ష హెూదాలో ఉన్న బీజేపీ.. కాగ్ నివేదికపై పదే పదే పట్టుబట్టింది. కానీ అది చివరకు అసెంబ్లీకి రాలేదు. దాంతో ప్రస్తుత బీజేపీ సర్కారు కాగ్ నివేదికను అసెంబ్లీ సాక్షిగా బహిర్గతం చేసే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి.

# ఈడీ అధికారులపై దర్శకుడు శంకర్ ఆగ్రహం




ప్రముఖ తమిళ సినీ దర్శకుడు శంకర్ కు ఈడీ షాక్ ఇచ్చిన సంగతి తెలిసిందే. 'రోబో' సినిమాకు సంబంధించి నమోదైన కాపీరైట్ ఉల్లంఘన కేసులో శంకర్ కు చెందిన రూ. 10 కోట్ల విలువైన మూడు స్థిరాస్తులను ఈడీ అటాచ్ చేసింది. ఈడీ చర్యలపై స్పందించిన శంకర్... తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేశారు. కోర్టు తీర్పును కూడా పట్టించుకోకుండా ఈడీ అధికారులు ఇలాంటి చర్యలకు పాల్పడటం తనను ఎంతో బాధించిందని చెప్పారు. ఈడీ తీసుకున్న చర్యలను ఉద్దేశించి పలు విషయాలను ప్రజల దృష్టికి తీసుకురావాలనుకుంటున్నానని శంకర్ తెలిపారు. 'రోబో' సినిమాకు సంబంధించి నిరాధారమైన ఆరోపణలను చూపించి తనకు చెందిన మూడు స్థిరాస్తులను తాత్కాలికంగా అటాచ్ చేశారని చెప్పారు. 'రోబో' కథకు సంబంధించి ఆరూర్ తమిళ్ నాడాన్ వేసిన పిటిషన్ ను మద్రాసు హైకోర్టు తోసిపుచ్చిందని... ఆ తీర్పును విశ్వసించకుండా, కేవలం ఫిర్యాదు ఆధారంగా ఈడీ తన ఆస్తులను జప్తు చేసిందని అన్నారు. ఈడీ చర్య న్యాయపరమైన వాస్తవాలను తప్పుదోవ పట్టించడమేనని విమర్శించారు. ఆస్తుల అటాచ్ మెంట్ ను సవాల్ చేస్తూ అప్పీల్ కు వెళతానని చెప్పారు. ఈడీ అధికారులు తమ చర్యలపై పునఃసమీక్ష జరుపుతారని భావిస్తున్నానని శంకర్ తెలిపారు.

# నాని సహ నిర్మాతగా చిరంజీవి చిత్రం



మెగాస్టార్ చిరంజీవి వరుసగా సినిమాలు చేసేందుకు సిద్ధమయ్యారు. ఇకపై తన పూర్తి దృష్టి సినిమాలపైనే ఉంటుందని ఇటీవల ఓ కార్యక్రమంలో ఆయన స్పష్టం చేశారు. ఈ క్రమంలో 'దసరా' ఫేం శ్రీకాంత్ ఓదెల దర్శకత్వంలో చిరంజీవి సినిమా చేయబోతున్నారు. ఈ సినిమాకు హీరో నాని సహ నిర్మాతగా వ్యవహరిస్తున్నారు. తాజాగా ఈ సినిమా గురించి నాని కీలక అప్ డేట్ ఇచ్చారు. ఈ చిత్రం యాక్షన్ ఎంటర్టైనర్ గా తెరకెక్కుతుందని చెప్పారు. వచ్చే ఏడాది ఈ సినిమా షూటింగ్ ప్రారంభమవుతుందని తెలిపారు. చిరంజీవి సినిమాల విషయానికి వస్తే... ప్రస్తుతం ఆయన 'విశ్వంభర' షూటింగ్ లో బిజీగా ఉన్నారు. ఈ సినిమా షూటింగ్ చివరి దశలో ఉంది. వేసవికి ఈ సినిమాను విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు. తదుపరి చిత్రం అనిల్ రావిపూడి దర్శకత్వంలో చేయనున్నారు. నాని విషయానికి వస్తే... ప్రియదర్శి ప్రధాన పాత్రలో నాని సమర్పణలో 'కోర్ట్' సినిమా తెరకెక్కింది. వచ్చే నెల 14న ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు వస్తోంది. ఈ సినిమాకు సంబంధించి నాని ప్రచార కార్యక్రమాలను కూడా మొదలు పెట్టారు. ఈ సినిమా ప్రమోషన్ కార్యక్రమాల్లో నాని మాట్లాడుతూ... చిరంజీవి సినిమా గురించి అప్ డేట్ ఇచ్చారు.

# హీరో రామ్‌ను కలిసిన మంత్రి కందుల దుర్గేష్



కథానాయకుడు రామ్ తన తాజా చిత్రం షూటింగ్‌తో బిజీగా ఉన్నారు. ఆయన ప్రస్తుతం మహేష్ బాబు.పి దర్శకత్వంలో ఓ చిత్రంలో నటిస్తున్నారు. భాగ్య శ్రీ బోర్సే నాయికగా నటిస్తున్న ఈ చిత్రాన్ని మైత్రీ మూవీ మేకర్స్ పతాకంపై యలమంచిలి రవిశంకర్, మహేష్ బాబు.పి నిర్మిస్తున్నారు. 'డబుల్ ఇస్మార్ట్' వంటి భారీ పరాజయం తరువాత హీరో రామ్ నటిస్తున్న చిత్రమిది. రామ్ కెరీర్‌లో 22వ చిత్రంగా తెరకెక్కుతోన్న ఈ చిత్రానికి ఇంకా టైటిల్ నిర్ణయించలేదు.ప్రస్తుతం ఈ చిత్రం షూటింగ్ రాజమండ్రి పరిసర ప్రాంతాల్లో జరుగుతోంది. కాగా ఈ చిత్రం షూటింగ్ సెట్‌ను శనివారం (ఈ రోజు) ఏపీ సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ సందర్శించారు. ఈ సందర్భంగా రామ్ పోతినేనితో ఆయన కాసేపు ముచ్చటించారు. ఈ సందర్భంగా కందుల దుర్గేష్ మాట్లాడుతూ "రామ్‌లోని ఎనర్జీ, డ్యాన్సులు నాకెంతో ఇష్టం. రబ్బరు స్ప్రింగ్ తరహాలో బాడీని డ్యాన్స్ మూమెంట్స్‌తో మౌల్డ్ చేస్తాడు. ఇప్పటి వరకు ఏపీలో ఉన్న పర్యాటక ప్రాంతాల్లో, గోదావరి నది తీర ప్రాంతాల్లో చిత్రీకరణ చేసిన సినిమాలు దాదాపుగా విజయాలుగా నమోదు చేసుకున్నాయి.ఈ సినిమా కూడా ఆ కోవలోనే విజయం సాధించాలని కోరుకుంటున్నాను" అన్నారు. ఇక రెండు వారాల క్రితం ఈ సినిమా చిత్రీకరణ రాజమండ్రిలో మొదలైంది. ఈ చిత్రీకరణ కోసం హాజరైన హీరో రామ్‌కు ఇక్కడ ఆయన అభిమానులు ఘన స్వాగతం పలికారు. ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ: మధు నీలకందన్, సంగీతం: వివేక్.




# ఓటిటికి ముందే టీవిల్లో సక్రాంతికి వస్తున్నాం

విక్టరీ వెంకటేష్ ప్రధాన పాత్రలో నటించిన రీసెంట్ బ్లాక్ బస్టర్ సంక్రాంతికి వస్తున్నాం సినిమాఓటిటికి ముందే టీవీలో ప్రేక్షకులను అలరించనుంది. అనిల్ రావిపూడి దర్శకత్వం వహించగా.. శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ బ్యానర్‌పై దిల్ రాజు ఈ సినిమాను నిర్మించాడు. మీనాక్షి చౌదరి, ఐశ్వర్య రాజేష్ హీరోయిన్లుగా నటించారు. ఈ సంక్రాంతి పండుగకు ప్రేక్షకుల ముందుకు వచ్చిన బాక్సాఫీస్ వద్ద సూపర్ హిట్ అందుకుంది. అయితే ఈ సినిమా ఓటీటీలోకి ఎప్పుడు వస్తుందా అని ప్రేక్షకులు ఎదురుచూస్తున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలోనే ఓటీటీ లవర్స్‌కి షాక్ ఇస్తూ.. ఒక ప్రకటన విడుదల చేసింది. ఈ సినిమాను ఓటీటీ కంటే ముందుగా టీవీలో టెలికాస్ట్ చేయబోతున్నట్లు ప్రకటించింది. మార్చి 1 సాయంత్రం 6 గంటలకు జీతెలుగులో ఈ సినిమా ప్రీమియర్ కాబోతున్నట్లు చిత్రబృందం వెల్లడించింది. మరోవైపు ఈ చిత్రం ఓటీటీ తేదీ మరింత ఆలస్యం కాబోతున్నట్లు తెలుస్తుంది.

# ఆది పినిశెట్టి 'శబ్దం'..



టాలెంటెడ్ యాక్టర్ ఆది పినిశెట్టి ఇప్పుడు శబ్దం మూవీతో ప్రేక్షకుల ముందుకు వచ్చేందుకు సిద్ధమవుతున్న విషయం తెలిసిందే. దర్శకుడు అరివళగన్ తెరకెక్కిస్తున్న ఆ సినిమాలో లక్ష్మీ మీనన్ కీలక పాత్ర పోషిస్తున్నారు. అయితే ఇప్పటికే అరివళగన్, ఆది పినిశెట్టి కాంబోలో వైశాలి మూవీ వచ్చి అందరినీ ఆకట్టుకుంది. దీంతో ఇప్పుడు శబ్దం మూవీపై మంచి అంచనాలు నెలకొన్నాయి. ఆది పినిశెట్టి పారానార్మల్ ఇన్వెస్టిగేటర్ పాత్రలో నటిస్తున్న ఆ సినిమా.. ఫిబ్రవరి 28వ తేదీన థియేటర్లలో రిలీజ్ కానుంది. రీసెంట్ గా శబ్దం మేకర్స్.. ట్రైలర్ ను రిలీజ్ చేయగా మంచి రెస్పాన్స్ వచ్చింది. సినిమాపై ఆడియన్స్ లో పాజిటివ్ బజ్ నెలకొంది. సైకలాజికల్ ఇన్స్టిగేటివ్ థ్రిల్లర్ గా మూవీ ఉండనున్నట్లు.. ఇప్పటికే క్లియర్ గా అర్థమైంది. గబ్బిలాల శబ్దంతో బాధపడుతున్న ఓ మహిళ చుట్టూ సినిమా సాగుతున్నట్లు స్పష్టంగా తెలుస్తోంది. గబ్బిలాలు, దెయ్యం లాంటి సన్నివేశాలు... ఆడియన్స్ లో సినిమాపై మరింత ఆసక్తిని రేపుతున్నాయని చెప్పడంలో డౌట్ అక్కర్లేదు. అయితే ఇప్పుడు శబ్దం మేకర్స్.. పాత అండ్ రిస్కీ ట్రెండ్ ను ఫాలో అయ్యారు. అదేంటంటే.. గతంలో నిర్మాతలు తమ సినిమాలను అధికారిక విడుదలకు ముందే పంపిణీదారుల కోసం ప్రదర్శించేవారన్న విషయం తెలిసిందే. దాని ఆధారంగా థియేట్రికల్ బిజినెస్ నిర్వహించేవారు. కానీ కొద్ది రోజులుగా అలా జరగడం లేదు. ఇప్పుడు శబ్దం.. ఆ ట్రెండ్ ను రీస్టార్ట్ చేసింది. ఎందుకంటే శబ్దం థియేట్రికల్ రైట్స్ ను కొనుగోలు చేయడానికి డిస్ట్రిబ్యూటర్స్ పెద్ద ఆసక్తి చూపలేదని ఆ మధ్య వార్తలు వచ్చాయి. దీంతో నిర్మాతలు అవుట్ పుట్ పై చాలా నమ్మకంగా ఉండటంతో ఏరియా వారీగా పంపిణీదారుల కోసం ప్రత్యేక స్క్రీనింగ్ ఏర్పాటు చేశారు.

# ఆర్సీ 16 లో ప్రగ్యాజైశ్వాల్ ?



ముంబై బ్యూటీ ప్రగ్యాజైశ్వాల్ టాలీవుడ్ లో మళ్లీ బిజీ అవుతోందా? స్టార్ హీరోల చిత్రాల్లోనే అవకాశాలు అందుకుంటుందా? అంటే సన్నివేశం అలాగే కనిపిస్తుంది. ఈ సంక్రాంతి కి రిలీజ్ అయిన 'డాకు మహారాజ్' లో నటించింది. ఆ సినిమా మంచి విజయం సాధించింది. ఆ రకంగా బాలయ్య అవకాశం ఇవ్వడంతో? మరో సక్సెస్ ఖాతాలో నమోదైంది. కొత్త ఏడాదిని అమ్మడు అలా లాంచ్ చేసింది. అటుపై వెంటనే అదే బాలకృష్ణ తో 'అఖండ2' లోనూ ఛాన్స్ అందుకుంది. ఇది పాన్ ఇండియా చిత్రం. బోయపాటి శ్రీను భారీ కాన్వాస్ పై తెరకెక్కిస్తున్నాడు. ఈ సినిమాలో ఛాన్స్ రావడంతో ప్రగ్యా ఇమేజ్ రెట్టింపు అయింది. అలాగే సాయి శ్రీనవాస్ బెల్లంకొండ నటిస్తోన్న 'టైసన్ నాయుడు'లోనూ నటిస్తోంది. ఈ నేపథ్యంలో తాజాగా అమ్మడికి మరో బంపర్ ఆఫర్ కూడా వరించినట్లు తెలుస్తోంది. మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ హీరోగా బుచ్చిబాబు దర్శకత్వంలో ఓ సినిమా సెట్స్ లో ఉన్న సంగతి తెలిసిందే. ఇందులో చరణ్ కి జోడీగా ఇప్పటికే జాన్వీ కపూర్ నటిస్తోంది. ఈనేపథ్యంలో ఇదే సినిమాలో ప్రగ్యా జైశ్వాల్ ని ఓ కీలక పాత్రకు ఎంపిక చేసినట్లు సమాచారం. సినిమాలో ఆ పాత్ర చాలా ఆసక్తికరంగా ఉంటుందని మెగా లీకులందుతున్నాయి. ప్రగ్యా జైశ్వాల్ రోల్ చాలా మాసివ్ గా ఉంటుందిట. తొలుత ఆ పాత్ర కోసం అనసూయని తీసుకోవాలనుకున్నారుట. కానీ ఆమె ఇప్పటికే 'రంగస్థలం'లో మాస్ రోల్ చేయడంతో? ఫ్రెష్ నెస్ రాదని భావించి బుచ్చిబాబు ఫాంలో ఉన్న ప్రగ్యా జైశ్వాల్ అయితే బాగుటుందని అమెని అప్రోచ్ అయినట్లు వినిపిస్తుంది. మరి ఈ ప్రచారంలో నిజమెంతో తెలియాలి.